www.quicktodaynews.com
RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY
తెలుగు దిన పత్రిక

## విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.
తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476
క్విక్ టుడే తెలుగు దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 161 | శనివారం, మార్చి 02 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8



- తెలంగాణ కోసం ప్రాణాలను పణంగా పెట్టింది కేసీఆర్
- రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటే ఊరుకునేది లేదు
- కాళేశ్వరం అద్భుతమని సీడబ్ల్యూసీ ఇంజనీర్లే చెప్పారు
- బీఆర్ఎస్ మేడిగడ్డ టూర్ వల్ల కాంగ్రెస్ పై ఒత్తిడి పెరిగింది
- ఇది బీఆర్ఎస్ సాధించిన విజయం
- తన్నీరు హరీశ్ రావు
- అన్నారం బ్యారేజి వద్ద హరీశ్ రావు మీడియా సమావేశం
- కాంగ్రెస్ తీరుపై ఫైర్

### వానాకాలం వచ్చే లోపే మేడిగడ్డ పునరుద్ధరణ

# పనులు చేపట్టండి

**హైదరాబాద్,క్విక్ టుడే :** వానాకాలం వరదలు వచ్చే లోపే మేడిగడ్డ పునరుద్ధరణ పనులు చేపట్టాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అన్నారం బ్యారేజీ వద్ద హరీశ్ రావు మీడియా తో మాట్లాడారు. బీఆర్ఎస్ మేడిగడ్డ టూర్ వల్ల కాంగ్రెస్‌పై ఒత్తిడి పెరిగిందని, మేడిగడ్డ రిపేర్ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, ఇది బీఆర్ఎస్ సాధించిన విజయమన్నారు. ప్రగతిభవన్‌ను బాంబులతో పేల్చేస్తామని గతంలో రేవంత్‌రెడ్డి అన్నారని, కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని రేవంత్ అన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఎన్నో ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని, అప్పటి ప్రభుత్వాలు ప్రాజెక్టులకు రిపేర్‌లు చేసి నీటిని అందించాయన్నారు.రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తెలంగాణ కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన వ్యక్తి కేసీ ఆర్ అని, తెల ంగాణ కోసం పద వులను గడ్డిపో చల్లాగా వదులు కున్న వ్యక్తి కేసీఆ ర్ అని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటే ఊరు కునేది లేదన్నారు. అధికారం, పదవులు ఎవరికీ శాశ్వతం కావని, మనం చేసే మంచి పనులే శాశ్వతంగా నిలిచిపో తాయన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.



### మేడిగడ్డపై ఇంతకాలం

# నిజాలు దాచారు

### - మంత్రి ఉత్తమ్ కుమార్ ఆగ్రహం



**హైదరాబాద్,క్విక్ టుడే :** మేడిగడ్డ విషయంలో భారాస తీరు హాస్యాస్పదమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 'మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై సత్వర విచారణ జరగాలి. ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం భారీ తప్పులు చేసింది. కమీషన్ల కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టింది. కొన్ని రిపోర్టులను ప్రభుత్వం ఇవ్వలేదని ఎన్డీఎస్ఏ పేర్కొంది. విజిలెన్స్ నివేదికపై న్యాయసలహా తీసుకుని కేసులు నమోదు చేస్తాం' అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.చలో మేడిగడ్డ బయలుదేరిన బీఆర్ఎస్ కాన్వాయ్‌లోని ఓ బస్సు టైర్ పగడంతో చిన్న అపశృతి చోటు చేసుకుంది. ఈ ఘటనపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెళ్తున్న బస్సు టైర్ పగిలింది అని చూశా. కారు టైర్లు అన్నీ మిగిలిపోయాయి. ఇక షెడ్డుకు పోవాల్సిందే' అంటూ మంత్రి సెటైరికల్ కామెంట్స్ చేశారు.

మిగతా 3లో...

### ఈసారి భానుడి

# భగ భగలు



**న్యూఢిల్లీ,క్విక్ టుడే :** ఈ ఏడాది 2024 లో సూర్యుడు తన విశ్వరూపాన్ని చూపించనున్నాడు. చలికాలంలో వెచ్చదనాన్ని పంచాల్సిన భానుడు భగభగలాడిస్తున్నాడు. ఇందుకు సంకేతంగానే మార్చి చివర్లో రావాల్సిన ఎండలు ఫిబ్రవరి మొదట్లోనే వచ్చేశాయి. దీంతో రాబోయే రోజులు ఎలా గడుస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఐఎండీ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ వేసవికాలంలో భానుడు తన ప్రతాపాన్నంతా చూపిస్తాడని పేర్కొంది. ఎల్‌నినో పరిస్థితులు బలహీనపడ్డ ప్పటికీ అవి ఇంకా చురుగ్గానే ఉన్నాయని, వాటి ప్రభావం మే వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

మిగతా 3లో...



### రైతు, ఎడ్యుకేషన్

# కమిషన్ల ఏర్పాటు

- విద్యావిధానంపై కమిషన్ నిర్ణయం
- అఖిలపక్షంతో చర్చించి కౌలురైతులకు చేయూత
- పౌరసమాజం నేతలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,క్విక్ టుడే :** రైతు, ఎడ్యుకేషన్ కమి షన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నా మని... త్వరలోనే వీటిని ప్రకటించబోతున్నా మని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్థిక, విద్యుత్, సాగునీటి రంగాలపై పూర్తి వివరా లతో అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశా మని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాడు పౌర సమాజం ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... మన విద్యావిధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుందని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ధర్నా చౌక్‌ను తెరిచామని అన్నారు. ప్రజా భవన్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ప్రజా పాలన ద్వారా సంక్షేమ పథకాల దరఖాస్తులు స్వీకరించామన్నారు. 25 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకులాలను ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేయనున్నా మన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

మిగతా 3లో...

### మేడిగడ్డలో చిన్న సమస్య

# ఏర్పడింది



- భూతద్దంలో చూపి రాజకీయం చేస్తున్నారు
- రాజకీయాంగా మాపై కక్ష తీర్చుకోండి
- రైతులను మాత్రం కాపాడండి: కెటిఆర్

**మహదేవ్‌పూర్,క్విక్ టుడే :** మేడిగడ్డ అంశంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారాస కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను శుక్రవారం భారాస నేతల బృందం పరిశీలించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దదిగా చూపిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు, రూ. లక్ష కోట్లు వృథా చేశారంటూ అధికార పార్టీ దుష్ప్రచారం చేయడం సరికాదు. పగ, కోపం ఉంటే రాజకీయంగా మాపీ తీర్చుకోండి. రైతులు, రాష్ట్రంపై వద్దని కెటిఆర్ అన్నారు. 1.6కి.మీ బ్యారేజ్‌లో 50 మీటర్ల ప్రాంతంలో సమస్య ఉంది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నట్లుగా అధికార పార్టీ నేతలు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లవాగు రెండుసార్లు కొట్టుకుపో యాయి. నాగార్జున సాగర్, శ్రీశైలంలోనూ

మిగతా 3లో...



# దమ్ముంటే సిరిసిల్లలో రాజీనామా చేయ్

- నేను నల్లగొండలో రాజీనామా చేసి వస్తా
- బిఆర్ఎస్ నేత కెటిఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి సవాల్
- అవినీతి డబ్బుతో గెలిచిన అహంకారంతో కెటిఆర్
- మీడియా సమావేశంలో మంత్రుల విమర్శలు

**హైదరాబాద్,క్విక్ టుడే :** మల్కాజిగిరిలో పోటీ చేసి గెలవాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ సిఎం రేవంత్ రెడ్డికి చేసిన సవాల్‌పై రాష్ట్రమంత్రులు ఘాటు స్పందించారు. దమ్ముంటే సిరిసిల్లలో రాజీనామా చేయి..మాల ఎవరో ఒకరు పోటీ చేస్తారని ప్రతిసవాల్ విసిరారు. వందలకోట్లు ఖర్చు పెట్టి అత్తెసరు మెజార్టీతో గెలిచిన కెటిఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సవాల్ విసిరారు. తాను నల్లగొండ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, కేటీఆర్‌ఎస్ కూడా రిజైన్ చేయాలన్నారు. సిరిసిల్లలో తాను పోటీ చేసి గెలుస్తానని, అలా అయితే కారు షెడ్డు మూసుకుంటారా..? అని ప్రశ్నించారు. కేటీఆర్ ఓడితే పార్టీ క్లోజ్ చేస్తానని ప్రకటించేందుకు కేసీఆర్ సిద్ధమా? అని ప్రశ్నించారు. తాను సిరిసిల్లలో ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. కేటీఆర్ కు టెక్నికల్ నాలెడ్జ్ లేదని చెప్పారు. కేటీఆర్ ఓ చిన్న పిలగాడని, తన స్థాయి కేటీఆర్ ది కాదని అన్నారు.

మిగతా 3లో...

### 'మేడిగడ్డ'...

# బాగా మేశినవ్ బిడ్డా..!!

### ట్విట్టర్‌లో కాంగ్రెస్ పోస్ట్



**హైదరాబాద్,క్విక్ టుడే :** ప్రాజెక్టుల విషయంలో అధికార కాంగ్రెస్?, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ట్విట్టర్ వేదికగా కల్వ కుంట్ల కన్స్‌ట్రక్షన్స్ సమర్పించు 'మేడిగడ్డ' అనే టైటిల్ పెట్టి కేటీఆర్, కేసీఆర్ ఉన్న ఓ పోస్టర్ ను రిలీజ్ చేసింది.

మిగతా 3లో...

## పర్వతాపూర్‌లో వైద్య శిబిరానికి

# అనూహ్య స్పందన



**పీర్జాదిగూడ, క్విక్ టుడే :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. శుక్రవారం 4వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ మెయిన్ పై ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో పవర్ జిమ్ యజమాని రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. యశోదా దవాఖాన సిబ్బంది ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీఎకో వంటి వంటి పరీక్షలను చేశారు. కార్యక్రమంలో కార్డియోలజీ, గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, డెంటిస్ట్, నేత్ర వైద్యులు పాల్గొన్నారు.

# జెడ్పీలో సుమారు

# రూ. 8 లక్షల మేర ఆస్తి నష్టం

### షార్ట్ సర్క్యూట్ తో చెలరేగిన మంటలు




**నల్గొండ జిల్లా ప్రతినిధి, మార్చి 1 (క్విక్ టుడే) :**
నల్లగొండ జిల్లా కేంద్రంలోని పాత జడ్పీ కార్యాలయంలో ఉన్న జడ్పీ ఆడిట్ సెల్ కార్యా లయంలో గురువారం అర్ధరాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి. కొన్ని ఫైల్స్, కంప్యూటర్లు కాలిపోయాయని సుమారు రూ. 8 లక్షల ఆస్తినష్టం వచ్చిందని ఆడిట్ అధికారి కృపాకర్ తెలిపారు. కాలిపోయిన ఫైల్స్ అన్ని కూడా సిస్టమ్ లో భద్రంగా ఉన్నాయని, కాలిన ఫైల్స్ కూడా 10 శాతం మాత్రమే అని అన్నారు. గతంలో కూడా నల్లగొండలో విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అలాగే మున్సిపల్ కార్యాలయం కూడా ఫైల్స్ తగలబడిన ఘటన అందరికి తెలిసిందే. మరి ఈ మంటలు చెలరేగడనికి ఏమైనా కుట్రలు జరిగాయా లేక షార్ట్ సర్క్యూట్ కారణమా అనేది విచారణలో తేలే అవకాశం ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

## మొదటి ప్రయత్నంలోనే కెమిస్ట్రీలో

## గురుకుల పీజీటీ, జేఎల్, డీఎల్గా



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి 1 (క్విక్ టుడే) :** మొదటి ప్రయత్నంలోనే కెమిస్ట్రీ సబ్జెక్ట్ లో గురుకుల పీజిటీ, జేయల్, డియల్ సాధించిన అక్కలాయిగూడెం కి చెందిన కన్నెబోయిన రామరాజు యాదవ్ ను శుక్రవారం జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం, యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, మొదటి ప్రయత్నంలోనే పిజిటి 9వ ర్యాంకు, జేయల్ 2వ ర్యాంకు, డియల్ 6వ ర్యాంకులతో మూడు ఉద్యోగాలు సాధించడం పట్ల పలువురు అతనికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తరాల పరమేశ్ యాదవ్, యాదవ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు గంగుల చందువంశీ యాదవ్, యాదవ జర్నలిస్టుల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మామిడి దుర్గాప్రసాద్ యాదవ్, 9వ వార్డు కౌన్సిలర్ చిన్నాల అలివేలు జానయ్య యాదవ్, యాదవ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వజ్జ శ్రీనివాస్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బోడ వంశీ, నాయకులు కన్నెబోయిన రమేష్, బొమ్మ రమేష్ యాదవ్, జక్కల మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడను మోడల్ సిటీ గా

# మార్చడమే లక్ష్యం

**- మెరుగైన మౌలిక సదుపాయలు కల్పించే విధంగా ప్రణాళికలు**
**- 2024-25 అంచనా బడ్జెట్ అంచనా వ్యయం రూ.57 కోట్లు**
**- బడ్జెట్ సమావేశంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



**పీర్జాదిగూడ, క్విక్ టుడే :**
పీర్జాదిగూడ నగరాన్ని మోడల్ సిటీ గా మార్చాలనే లక్ష్యంతో ప్రజలకు నాలుగు సంవత్సరాల నుండి పారదర్శక పాలన అందిస్తూ మెరుగైన మౌళిక సదుపాయలు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని సంబంధిత అధికారులు తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసి అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని దిశానిర్ధేశం చేయడం జరిగింది. నగర పరిధిలో ప్రజలకు అవసరమైన త్రాగునీరు, సిసి రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ ఇతర సమస్యలు లేకుండా చూడాలని సూచించడం జరిగింది. శుక్రవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్ నందు మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధ్యక్షతన 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అనంతరం 23 అంశాలతో కూడిన తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2024-25 సంవత్సర అంచనా బడ్జెట్ మరియు 2023-24 సంవత్సర సవరణ బడ్జెట్ ను సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

**బడ్జెట్ పద్దుల వివరాలు ఇలా ఉన్నాయి..**
పన్నులపై ఆదాయం అంచనా - 20.10 కోట్లు
ఇతర పన్నులపై ఆదాయం అంచనా - 26.52 కోట్లు
మొత్తంగా 47.02 కోట్లు
నాన్ ప్లాన్ గ్రాంట్ల పై అంచనా ఆదాయం - 6.95 కోట్లు
ప్లాన్ గ్రాంట్ల పై అంచనా ఆదాయం -- 1.5 కోట్లు
ఇతర గ్రాంట్లపై అంచనా ఆదాయం - 3.60 కోట్లు
మొత్తంగా 57.73 కోట్లు



**2024-25 బడ్జెట్ పద్దు**
అంచనా వ్యయం (గ్రాంట్లు కలుపుకొని) 57 కోట్లు
31-03-2025 నాటికి మిగులుఅంచనా నిల్వ 72.48 లక్షలు

**ప్రధానంగా చర్చించిన అంశాలు :**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 100% చెత్త రహితంగా తీర్చిదిద్దడానికి మరో ముందడుగు వేస్తూ ఐటీసీ స్వచ్ఛంద సంస్థలతో నగర పరిధిలో ఉత్పత్తి ఆయ్యే పొడి చెత్త నిర్వహణకు సంబంధించి ఎంఓయూ ఒప్పందం చేసుకోబోతున్నట్లు తెలిపారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణ 100 శాతం జరుగుతుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రజలందరూ నగర స్వచ్ఛతలో భాగస్వామ్యం అవుతుండటం అభినందనీయమన్నారు.

**"బర్తన్ బ్యాంక్ (స్టీల్ పాత్రల బ్యాంక్)"**
నగర పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నుండి పెరుగుతున్న కాలుష్యం మరియు దాని ప్రమాదకరమైన ప్రభావాలు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటి నివారణకు "బర్తన్ బ్యాంక్ (స్టీల్ పాత్రల బ్యాంక్)" లను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసామన్నారు. చిన్న చిన్న ఫంక్షన్‌లలో కూడా ప్రజలు ప్లాస్టిక్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు దీని వల్ల పెద్దఎత్తున వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి, కావున పుట్టినరోజు వేడుకలు, వివాహం మరియు ఇతర పార్టీలలో సింగల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రణ చేయడానికి వీటిని వినియోగించుకొని స్వచ్ఛ పీర్జాదిగూడ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కాగలరు. జంతు జనన నియంత్రణ, వీధి కుక్కల కోసం యాంటీ రేబిస్ టీకాలు ఇచ్చే బ్లూక్రాస్ సంస్థతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఎంఓయూ చేసుకోవడం జరిగిందని వీధి కుక్కల బెడదకు శాశ్వత విముక్తి కల్పించేందుకు మరింత విస్తృతమైన ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నగర పరిదిలో తాగునీటి సమస్య లేకుండా క్రమంతప్పకుండ మంచినీరు సరఫరా చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే పీర్జాదిగూడ 50 లక్షల నీటి నిల్వ సామర్థ్యం, మేడిపల్లి లో 20 లక్షలు, పర్వతాపూర్ లో 20 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన రిజ రాయర్లు నిర్మాణం చేయనున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ త్రిలేశ్వర్ రావు,మానేజర్ జ్యోతి టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, ఏఈ బిక్షపతి, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, యూపీహెచ్‌సీ డాక్టర్ ప్రతిభ, డాక్టర్‌ప్రవీణ పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ఆదర్శప్రాయుడు వెంకట్ నారాయణ



**హైదరాబాద్, క్విక్ టుడే :** విధి నిర్వహణనే లక్ష్యంగా నిరంతరం పని చేసి ఆదర్శప్రాయుడిగా నిలిచిన ఉత్తమ అధికారి వెంకటనారాయణ అభినందనీయుడని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ చీఫ్ అకౌంట్ ఆఫీసర్ బి. తిరుపతమ్మ తెలిపారు. సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ లో ఆర్టీసీ జీ హెచ్ జడ్ కార్యాలయం లో సూపరిండెంట్ (ఫైనాన్స్) గా విధులు నిర్వహిస్తున్న వెంకటనారాయణ పదవీ విరమణ సందర్భంగా దంపతులను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మాని ంచారు. సంస్థలో కండక్టర్ ఉద్యోగం నుండి ఉన్నతాధికారి వరకు ఎదిగిన వెంకటనారాయణ అభినందనియుడన్నారు. తన ఉద్యోగ ధర్మాన్ని తుచ తప్పకుండా నిర్వహిస్తూ సిబ్బందితో పనులు చేయించడంతో పాటు వారిని ఆదరించి అక్కున చేర్చుకున్న ఘనత ఉందని తెలిపారు. తాను పనిచేస్తున్న సంస్థ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేయడంతో పాటు తోటి ఉద్యోగులను చైతన్యపరిచి సమిష్టి కృషితో సంస్థ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతు ప్రతి ఒక్కరు తన విధి నిర్వహణను సక్రమంగా నిర్వహించినప్పుడే అధికారుల గుర్తింపు తో పాటు పని చేస్తున్న సంస్థకు మనుగడ ఉంటుందని చెప్పారు. విధినిర్వాహణను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ అధికారులు గాబ్రియేల్, అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్) వెంకటేశ్వర్లు, జియావుద్దీన్, స్వరూప, సూపరిండెంట్ రాధాకృష్ణ, ప్రభాకర్ సిబ్బంది ఎన్ జే ఎం రెడ్డి, శ్రీశైలం, రాములు, స్వామి, వెంకటయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## చలో మేడిగడ్డకు
## తరలిన ఉమ్మడి నల్లగొండ జిల్లా
## బీఆర్ఎస్ నాయకులు



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి1 (క్విక్ టుడే) :**
బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు చలో మేడిగడ్డ పిలుపు మేరకు ఉమ్మడి నల్లగొండ నుంచి ఆ పార్టీ నాయకులు భారీగా తరలి వెళ్లారు. ఇందులో భాగంగా ఈ బృందం సభ్యులు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టును నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్, చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్ కుమార్, నోముల భగత్, బీఆర్ఎస్ నాయకులు గుత్తా అమిత్ రెడ్డి తదితరులు సందర్శించారు.

## పార్టీ ఆదేశిస్తే మా కుమారుడు

# భువనగిరి నుంచి పోటీ

### శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి1 (క్విక్ టుడే) :**
స్వామివారిని దర్శించుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వెల్లడించారు. భువనగిరి మండలం నమాత్ పల్లి గ్రామంలోని సుదర్శన నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి ప్రాంతంతో మాకు మంచి సంబంధాలు ఉన్నాయి అన్నారు. నేను మదర్ డైరీ చైర్మన్ గా ,ఎంపీగా పనిచేసిన నాటి నుండి నేటి వరకు అందరితో మంచి సంబంధాలు ఉన్నాయి అన్నారు. అధిష్టానం ఆదేశిస్తే ఇక్కడి నుండి ఎంపీగా తనా తనయుడు పోటీకి సిద్ధం అన్నారు. నా కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి ఎంపీగా పోటీ చేసే విషయంలో అదిష్టానం నిర్ణయమే శిరోధార్యం అన్నారు .ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమ వెంకటేశ్వర్లు, రిటైర్డు వార్డెన్స్ సంఘం అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు ,గ్రామ పెద్దలు , తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన, వివాహ
పదవీ విరమణ
శుభాకాంక్షలు

ఉద్యోగం, వ్యాపారం
రియల్ ఎస్టేట్
బహిరంగ ప్రకటనలు

జయంతి, వర్ధంతి
శ్రద్ధాంజలి, నిర్యాణము

అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి
88864 60073
81259 72476

నార్కట్ పల్లి కామినేని హాస్పటల్ ఆధ్వర్యంలో

# ఉచిత దంత వైద్య శిబిరం



**గుండాల, క్విక్ టుడే :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో కామినేని హాస్పిటల్ నార్కట్పల్లి వారి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని కామినేని హాస్పిటల్ పిఆర్ఓ నర్సింగరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో మా వైద్యశాల సేవలు ప్రతి ఇంటికి అందాలనే ఉద్దేశంతో దంత వైద్యంతో పాటు అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మా వైద్య సేవ అందిస్తామని అన్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి సబ్సిడీతో వైద్య పరీక్షలు అవసరం అయినా వారికి ఆపరేషన్లు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వారికి వైద్య సేవ లు అందిస్తామని అన్నారు. మేము ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పాల్గొన్న వారికి నార్కట్ పల్లి వైద్యశాలకు రావడానికి పోవడానికి సంబంధించిన వాహనాన్ని ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామని దీనిని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీలిమ, డాక్టర్ రశ్మిత, డాక్టర్ శృతి, డాక్టర్ నికితా రెడ్డి, డాక్టర్ రామ్ సుభాష్, డాక్టర్ మౌనిక, డాక్టర్ హరిక, తదితరులు పాల్గొన్నారు.

# లింగ వివక్షత ను నిర్మూలించాలి..

## ప్రాజెక్ట్ ఆఫీసర్ జోష్న



**గుండాల, క్విక్ టుడే :** లింగ వివక్షతను నిర్మూలించి, ఆడపిల్లలను ఎదగనివ్వాలని ఐసిడిఎస్ మోత్కూర్ ప్రాజెక్టు అధికారిని జోష్న పిలుపునిచ్చారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని మరిపడగ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణి స్త్రీలకు, బాలింతలకు లింగ వివక్షత, ఆడ పిల్లల చట్టాలపై అవగాహన, కల్పించి టోల్ ఫ్రీ నెంబర్లు, పిల్లలను దత్తత తీసుకోనే అంశాలపై అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలు కడుపులో ఉన్న శిశువులను ఆడ మగ పరీక్షలు చేసిన చేయించుకున్న ప్రోత్సహించిన వివరాలు మాకు తెలిసినట్లయితే విచారణ జరిపి ఆ సెంటర్ల పై కేసు నమోదు చేసి శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ యాక్ పాషా బేగం, అంగన్వాడీ టీచర్లు కలమ్మ, స్వరూప, ఆశా వర్కర్ భాగ్య, తల్లులు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# వేధింపులకు గురి చేస్తున్న హాస్పిటల్ కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలి



నల్లగొండ.మార్చి 1 (క్విక్ టుడే) :

కార్మికుల పట్ల పక్షపాత వైఖరితో హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికుల ఆత్మహత్యా యత్నానికి కారణమైన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హాస్పిటల్ లో విధుల నుండి తొలగించారనే మనస్తాపంతో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కార్మికులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ గత సంవత్సరం జీవో 60 ప్రకారం పిఎఫ్ ఈఎస్ఐతో కలిపి రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా రూ.11వేల వేతనం, పిఎఫ్ ఈఎస్ఐ చెల్లిస్తున్నారని అన్నారు. కార్మికుల డ్యూటీల పట్ల పక్షపాత వైఖరి అవలంబిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. హాస్పిటల్ కాంట్రాక్టర్ సాయి సెక్యూరిటీ ఏజెన్సీ పై చర్య తీసుకొని ,కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వమే వేతనాలు నేరుగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల ఆత్మహత్యాయత్నం

## నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధుల నుంచి తొలగించడంతో మనస్తాపం







**నల్లగొండ జిల్లా ప్రతినిధి మార్చి 1 (క్విక్ టుడే) :** నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నాగమణి, జానకి, లలిత అనే ముగ్గురు పారిశుద్ధ కార్మికులు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఔట్సోర్సింగ్ ఏజెన్సీ వారు పరిశుద్ధ కార్మికులకు సరైన టైంలో వేతనాలు ఇవ్వకపోవడంతో ఇటీవల కాలంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసుపత్రి సందర్శించినప్పుడు పారిశుద్ధ్య కార్మికులు వినతిపత్రం సమర్పించారు. దీంతో కక్ష కట్టిన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ వారు విధుల నుండి నిర్దాక్షిణ్యంగా నాగమణి, జానకి, లలిత అనే శానిటేషన్ సిబ్బందిని తొలగించారు. దీంతో మనస్థాపానికి గురైన వీరు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తోటి సిబ్బంది గుర్తించి వీరిని హాస్పిటల్లో చేర్పించారు. దీనిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు.

# మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

## రూ.5 లక్షల చెక్కు అందజేసిన రాఘవ కంపెనీ



**నల్లగొండ మార్చి 1 (క్విక్ టుడే) :** మిషన్ భగీరథ కాంటాక్ట్ కార్మికుడు వేతనాలు రాక అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కస్పరాజు నవీన్ కుటుంబానికి రాఘవ కంపెనీ నుండి రూ.5 లక్షల చెక్కును శుక్రవారం మిషన్ భగీరథ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు జంజరాల శ్రీనివాస్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు రాఘవ కంపెనీ నుండి వేతనాలు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల బాధతో ఫిబ్రవరి 23న తిప్పర్తి మండలం గడ్డి కొండారము గ్రామానికి చెందిన కస్పరాజు నవీన్ ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఆ సందర్భంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించగ కంపెనీ యాజమాన్యం ఐదు లక్షల ఎక్స్గ్రేషియా ఇస్తామని హామీ ఇచ్చినది. ఆ హామీ మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా రాఘవ కంపెనీ ఇన్చార్జి మహేష్ ఆధ్వర్యంలో సూపర్వైజర్ కస్పరాజు నరసింహ,కొమ్ము సతీష్ లు 5లక్షల రూపాయల చెక్కును మృతుడి భార్య కస్పరాజు శివాని, తండ్రి కస్పరాజు సైదులుకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు జంజారాల జానయ్య నీలకంఠం అంజయ్య కస్పరాజు శ్రీను, శోభన్ దూదిమెట్ల అంజయ్య, జంజారాల జానయ్యా ,కస్పరాజు నవీన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

# మేడిగడ్డపై ఇంతకాలం

2023 అక్టోబర్ 21న మేడిగడ్డ కుంగిపోయిందని.. తాము అధికారంలోకి వచ్చేవరకు కేసీఆర్ నోరు మెదపలేదన్నారు. నల్లగొండ సభలో ఏం మాట్లాడలని కేసీఆర్ వెళ్లారని ప్రశ్నించారు. తెలంగాణని నాశనం చేసి మళ్ళీ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్నారు. మేడిగడ్డపై ఎన్డీఎస్ఏకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. మేడిగడ్డ దగ్గరకి బ్యారేజీ తరలించేందుకే తుమ్మిడిహెట్టి దగ్గర నీటి లభ్యత తక్కువ అని కేసీఆర్ చెప్పారని.. సీడబ్ల్యూసీ చెప్పిందని కేసీఆర్ అబద్ధం చెప్పారని కేంద్రం చెప్తోందని అన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక త్వరలో వస్తుందని.. బాధ్యుల పేర్లతో సహా నివేదిక వస్తుందని తెలిపారు. నివేదిక అనుగుణంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

## ఈసారి భానుడి భగభగలు

దేశంలోని చాలా ప్రాంతాల్లో మార్చి నుంచి మే వరకు పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. వాయువ్య ప్రాంతంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశం మొత్తం కఠినమైన వేసవిని ఎదుర్కొనే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. కోస్తా తీర భారతం, ఈశాన్య, పశ్చిమ, మధ్య, వాయువ్య ప్రాంతాలలో మార్చిలో నెలవారీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయి. తూర్పు, తూర్పు-మధ్య భారతదేశంలోని చాలా ప్రాంతాలు, వాయువ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం నుంచి సాధారణం కంటే తక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉంది. హిమాలయ ప్రాంతాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతల్లో మార్పులు ఉండకపోవచ్చని ఐఎండీ అంచనా వేసింది. దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ వేడిగాలులు వీచే అవకాశం ఉంది. బలహీనపడిని ఎల్నినో పరిస్థితులు మే వరకు కొనసాగుతాయని అధికారులు భావిస్తున్నారు.

## మేడిగడ్డలో చిన్న సమస్య ఏర్పడింది

లీకేజ్లు వచ్చాయి. వాటిపై మేం రాజకీయాలు చేయలేదు. నిపు ణుల సలహాలు తీసుకొని వరదలు వచ్చేలోగా మేడిగడ్డను పునరుద్ధరిం చాలని కోరుతున్నాం మని కెటిఆర్ తెలిపారు. రైతులు, రాష్ట్రంపై పగ పట్టవద్దు.. పగ, కోపం ఉంటే రాజకీయంగా తమపై తీర్చుకుంటే ఇబ్బంది లేదు అని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మేడిగడ్డ బరాజ్ను పరిశీలన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.మేడిగడ్డకు సంబంధించి 1.6 కిలోమీటర్ల బరాజ్లో 50 మీటర్ల ప్రాంతంలో సమస్య ఉందని తెలిపారు. ఇలాంటివి గతంలో ఎప్పుడూ జరగలేదన్నట్లు మాట్లాడడం సరికాదు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లవాగు రెండుసార్లు కొట్టుకుపోయాయి. నాగార్జున సాగర్, శ్రీశైలంలోనూ లీకేజ్లు వచ్చాయి. సాగర్, శ్రీశైలంలో వచ్చిన లీకేజ్లను తాము రాజకీయం చేయలేదు. నిపుణుల సలహాలు తీసుకుని మేడిగడ్డను పునరుద్ధరించాలని కోరుతున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు. మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దదిగా చూస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టే నిష్ఫలమైందని, దీని ద్వారా రూ. లక్ష కోట్లు కొట్టుకుపోయాయని దుష్ప్రచారం చేయడం సరికాదు. తమపై ఏదైనా కోపం, రాజకీయ వైరం ఉంటే తీర్చుకోండి.

## రైతు, ఎడ్యుకేషన్ కమిషన్లను ఏర్పాటు

. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులు తొలగించి ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీ ద్వారా నియామకాలు చేపడతామని స్పష్టం చేశారు. కౌలు రైతుల రక్షణకు సంబంధించి అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని అన్నారు. అందరి సూచనలు , సలహాలు ఆధారంగా కౌలు రైతుల రక్షణకు చట్టం తీసుకురావాలని యోచిస్తున్నామని వివరించారు. రైతు భరోసా అనేది పెట్టుబడి సాయమని.. భరోసా ఎవరికి ఇవ్వాలనే దానిపై విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని అన్నారు.

## దమ్ముంటే సిరిసిల్లలో రాజీనామా చేయ్

కేటీఆర్ కు క్యారెక్టర్ లేదని, లక్షల కోట్లు మాత్రమే ఉన్నాయని విమర్శించారు. కేటీఆర్ 200 కోట్లు ఖర్చు పెట్టి కేవలం 30 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారని, తానైతే రాజీనామా చేసేవాడినని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. బండి సంజయ్, అర్వింద్ పెద్ద లీడర్లు అనుకుంటున్నారని, ఎంపీ ఎన్నికల తర్వాత పిచ్చి లేసి పోతారని అన్నారు. వీళ్లిద్దరూ పొలిటికల్ లీడర్లు కాదని గాల్లో గెలిచారన్నారు. బ్రేకింగ్ కోసం మాత్రమే మాట్లాడుతారని విమర్శించారు. ఆ నలుగురు ఎంపీలు రాష్ట్రం కోసం ఎప్పుడూ పార్లమెంట్ లో మాట్లాడలేదని అన్నారు. దమ్ముంటే కరీంనగర్ లో కేటీఆర్ పోటీ చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ముందు కరీంనగర్ లో తమపై గెలిచి చూపించి మాట్లాడాలన్నారు. కేసీఆర్ మానసపుత్రిక బొందలగడ్డగా మారడానికి కారణం ఎవరు చెప్పాలన్నారు. మేడిగడ్డలో ఒకట్రెండు పిల్లర్లే కుంగాయంటూ అవహేళన చేస్తున్నారని విమర్శించారు. ఇంట్లో ఒక పిల్లర్ కూలినా ఇల్లు కూలిపోయినట్లేనన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామన్నారు పొన్నం ప్రభాకర్. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు హామీలు అమలు చేశామన్నారు. ఇది చూసిన బీఆర్ఎస్ నేతలకు కళ్లు మండుతున్నాయని..అందుకే ఏదేదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## 'మేడిగడ్డ'... బాగా మేశినవ్ బిడ్డా..!!

దీనికి'బాగా మేశినవ్ బిడ్డా..!!' అనే ట్యాగ్లైన్ ఇచ్చింది. 'మేత మేసిన మేడిపండ్లన్నీ మేడి గడ్డకు బయల్దేరినయ్..!! కాగ్కు ఏం తెలుసు కాకరకాయ. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ అధి కారులకేం తెలుసు అరటికాయ.. అన్ని బీఆర్ఎస్ బిల్డప్ బాబాయ్ లకే తెలుసు. అసలే వాళ్ళ నేత 80,000 పైగా పుస్తకాలు చదివిండాయె. ఇప్పుడు ఆ బ్రహ్మ జ్ఞానంతో ఇక్కడ బ్రహ్మాండం చెయ్యబోతున్నారు. ఆ బ్రహ్మాండమెందయ్య అంటే.. ఎక్కడో ఒక చోట కూల్ గా సెల్ఫీ తీసు కొని కూలలేదు, కుంగలేదు అంటే అయిపాయె. సిగ్గుండాలే బీఆర్ఎస్.. అదే ఉంటే అందరితో వచ్చేది. అది లేకనే ఇలా దొంగల్లా వచ్చింది.' అంటూ ట్విట్టర్లో టీపీసీసీ పోస్ట్ చేసింది.

# యాదాద్రి ఆలయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి

## కొబ్బరికాయలు కొట్టే స్థలం ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**యాదాద్రి :** యాదాద్రి ఆలయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి ఉంటుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక స్వాగతం పలికి ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదం అందజేశారు. కొండపైన తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న క్యూ లైన్ల సమీపంలో స్వామి వారికి మొక్కు చెల్లించుకొని కొబ్బరి కాయలు కొట్టే స్థలాన్ని ప్రారంభిచారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గతంలో భక్తులు మొక్కులు తీర్చుకోవటం కోసం స్వామివారిని దర్శించుకొని కొబ్బరి కాయలు కొట్టే వారు కానీ ఆలయ అభివృద్ధి పేరు మీద కొబ్బరి కాయలు కొట్టే స్థలం లేకుండా చేయడం జరిగిందని, మళ్ళీ ఈ ప్రజాపాలనలో కొబ్బరి కాయలు కొట్టేందుకు స్థలం ఏర్పాటు చేసి ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా భక్తులు నిద్ర చేయడం కోసం డార్మెంటరీ హాల్ నిర్మాణంతో పాటు తాత్కాలిక హాల్ ఏర్పాటు చేశామని అన్నారు. ఆలేరులో ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి యుద్ధ ప్రాతిపదికన పలు పనులను పునరుద్ధరించామని తెలిపారు. 300 మంది ఆటో కార్మికులకు విముక్తి చేసి కొండపైకి అనుమతించడంతోపాటు డార్మెంటరీ హాల్ నిర్మాణం, కొబ్బరికాయలు కొట్టడానికి స్థలాన్ని ఏర్పాటు చేసి, అర్చకులకు వసతులు ఏర్పాటు చేయడంలో ముందుకు వెళ్తున్నామని అన్నారు. అదేవిధంగా ఆలయంలో అర్చకులకు ప్రత్యేక వసతులు కల్పించి దానితోపాటు ఎక్కువ నిధులు ఇచ్చి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. యాదాద్రి, భద్రాద్రి అని ఆంధ్ర పేర్లు పెట్టడం సరికాదని త్వరలో యాదాద్రిని యాదగిరిగుట్టగా మార్చబోతున్నామని అన్నారు. మరో 15,నెల రోజులలో రివ్యూ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. దానితోపాటు యాదాద్రి ఆలయ అర్చకుల కోసం రెస్ట్ రూమ్, వాష్ రూమ్ నిర్మాణం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

## మహదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో రూ. 580 కోట్ల ఆస్తుల స్వాధీనం



**ముంబై :**మహదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించి ఈడీ శుక్రవారం రూ. 580.78 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంది. మహదేవ్ యాప్ కార్యకలాపాలు దుబాయ్ నుంచి నిర్వహిస్తున్నారని ఈడీ వెల్లడించింది. మహదేవ్ యాప్‌తో కుమ్మక్కై మనీ ల్యాం డరింగ్ నెట్‌వర్క్ సాగిస్తున్నారనే అనుమానంతో 15 ప్రాంతాల్లోని పలువురు వ్యక్తులపై దాడులు చేపట్టిన అనంతరం ఈడీ పెద్దమొత్తంలో ఆస్తులను స్వాధీనం చేసుకుంది.కోల్‌కతా, గురుగ్రాం, ఢిల్లీ, ఇండోర్, ముంబై, రాయ్‌పూర్‌లో ఈడీ దాడులు చేపట్టింది. దాడుల సందర్భంగా రూ. 1.86 కోట్ల నగదు, రూ. 1.78 కోట్ల విలువైన వస్తువులతో పాటు నేరం ద్వారా ఆర్జించిన రూ. 580 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ స్తంభింపచేసింది. మహదేవ్ యాప్ కేసులో ప్రధాన ప్రమోటర్లు సౌరవ్ చంద్రార్కర్, రవి ఉప్పల్‌కు వ్యతిరేకంగా ఓ చార్జిషీట్‌తో పాటు ఈడీ రెండు చార్జిషీట్లను దాఖలు చేసింది.ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీస్ ఆధారంగా ఇద్దరు ప్రమోటర్లను ఇటీవల దుబాయ్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారిని భారత్‌కు అప్పగించేలా ఈడీ కసరత్తు సాగిస్తోంది. తొలి చార్జిషీట్‌లో చంద్రాకర్ రస్ అల్ ఖైమాలో తన పెండ్లికి ఏకంగా రూ. 200 కోట్లు వెచ్చించాడని ఈడీ ఆరోపించింది. చంద్రార్కర్ బంధువుల కోసం ప్రైవేట్ జెట్స్‌ను బుక్ చేశారని, సెలబ్రిటీల పెర్ఫామెన్స్ కోసం పెద్ద మొత్తం ఖర్చుచేశారని పేర్కొంది. ఈ కేసులో మొత్తం రూ. 6000 కోట్ల వరకూ అక్రమ లావాదేవీలు జరిగాయని ఈడీ గుర్తించింది.

## సాంకేతిక సమస్య వల్ల పొలాల్లో దిగిన ఆర్మీ హెలికాప్టర్



**జైపూర్:** ఇండియన్ ఆర్మీకి చెందిన చేతక్ హెలికాప్టర్ సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ముందు జాగ్రత్త కోసం పొలాల్లో దానిని ల్యాండ్ చేశారు. అనంతరం అక్కడి నుంచి అది ఎగిరి వెళ్లింది. అయితే ఆర్మీ హెలికాప్టర్‌ను చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం జైపూర్‌కు వెళ్తున్న ఆర్మీకి చెందిన చేతక్ హెలికాప్టర్‌లో ఇంజిన్ చిప్ వార్నింగ్ లైట్ ఆన్ అయ్యింది. దీంతో పైలట్లు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త కోసం సమీపంలోని పొలాల్లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. కొంత సేపటి తర్వాత ఆ హెలికాప్టర్ అక్కడి నుంచి ఎగిరి వెళ్లింది. అయితే ఆర్మీ హెలికాప్టర్‌ను చూసేందుకు స్థానికులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు.కాగా, ఇండియన్ ఆర్మీ ఈ విషయాన్ని ధృవీకరించింది.

జైపూర్‌కు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న దిద్వానాలో శుక్రవారం ఉదయం 10:35 గంటల సమయంలో సైనిక హెలికాప్టర్ పొలాల్లో దిగినట్లు తెలిపింది. ఆ సమయంలో అందులో వీఐపీలు ఎవరూ లేర ని పేర్కొంది. సాంకేతిక సమస్యను సరిదిద్దిన తర్వాత హెలికాప్టర్ నిర్ణీత గమ్యస్థానానికి చేరుకున్నట్లు వెల్లడించింది. మరోవైపు ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో పనిచేసి భక్తులకు సేవలందించాలి : టీటీడీ చైర్మన్



**తిరుపతి :** భగవంతుని సేవలో ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో పనిచేసి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి కోరారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం పరేడ్ మైదానంలో ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన చైర్మన్ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులకు మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు, క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు ప్రతి సంవత్సరం క్రీడాపోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు పునరుత్తేజం కలుగుతుందని చెప్పారు. ఉద్యోగులకు క్రీడల పట్ల ఉన్న శ్రద్ధను గమనించి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి తమ బోర్డు రూ.10 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.ఈవో ఏవి.ధర్మారెడ్డి ఉద్యోగులతో క్రీడాప్రతిజ్ఞ చేయించగా చైర్మన్ క్రీడాపతాకాన్ని ఆవిష్కరించారు. టగ్ ఆఫ్ వార్, చెస్, వాలీబాల్, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, టెన్నిస్ తదితర క్రీడలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

## ధ్వజారోహణంతో కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**తిరుపతి :** తిరుపతిలోని కపిలేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారో హణ ంతో వైభవంగా ప్రారం భమయ్యాయి. అర్చకుల వేదమం త్రోచ్ఛారణ, శంఖనాదాలు, శివనా మస్మ రణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రో క్తంగా జరిగింది. పంచమూర్తులైన సోమ స్కంధమూర్తి , కామాక్షి అమ్మవారు, వినాయక స్వామి, చండికేశ్వరస్వామి, వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారి ఉత్సవమూర్తుల సమక్షంలో మీన లగ్నంలో నంది చిత్రంతో కూడిన వస్త్రాన్ని ధ్వజపటానికి చుట్టి ధ్వజస్తంభంపైకి అధిరోహింపచేశారు.ధ్వజారోహణంలో భాగంగా మొదట ధ్వజపటం అధిరోహణ, ఆ తరువాత ధ్వజస్తంభానికి అభిషేకం, బలి, నివేదన,

దీపారాధన, ఉపచా రాలు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు, కంకణభట్టర్ మణివాసన్ గురుకుల్ మీడియాతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10 రోజులపాటు ఉద యం 7 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలు జరుగ ుతా యని తెలిపారు. అనంతరం సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. పల్లకీపై స్వామి, అమ్మవారు తిరుపతి పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనం ఇచ్చారు.

## దమ్ముంటే ఆ ఇద్దరిని తమిళనాడు నుంచి పోటీ చేయించండి..

### బీజేపీకి అన్నాడీఎంకే సవాల్



**చెన్నై :** తమిళనాడులో భారతీయ జనతా పార్టీ గ్రాఫ్ పెరిగిందని భావిస్తే.. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ఎస్ జైశంకర్‌ను లోక్‌సభ ఎన్నికల్లో ఈ రాష్ట్రం నుంచి పోటీ చేయించాలని బీజేపీకి అన్నాడీఎంకే సీనియర్ లీడర్ కేపీ మునిసామి సవాల్ విసిరారు. నిర్మలా సీతారామన్, జైశంకర్ ఇద్దరు కూడా తమిళనాడు వాసులే.ఈ సందర్భంగా మునిసామి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నమలైని చేయించాలన్నారు.

# మేడిగడ్డను సరిచేయండి..

## వ్యవసాయాన్ని రాజకీయాలతో ముడిపెట్టొద్దు

## : నిరంజన్ రెడ్డి

**కాళేశ్వరం:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌లో కుంగింది మూడు పిల్లర్లు మాత్రమే అని, వాటిని సరి చేసి వ్యవసాయానికి నీళ్లు ఇవ్వాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచించారు. వ్యవసాయాన్ని రాజ కీయాలతో ముడిపెట్టి.. రైతుల పొలాలను ఎండబెట్టొద్దు.. రైతాంగం ఉసురు పోసుకోవద్దు అని నిరంజన్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ బరాజ్ సందర్శన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లా డారు.మేడిగడ్డ బరాజ్ విషయంలో తప్పులు జరిగి ఉంటే ఉన్న తస్థాయి విచారణ జరిపి శిక్షలు పడేలా చూడాలి. కానీ రైతుల పొలాలను ఎండబెట్టకూడదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ ఒక బరాజ్ మాత్రమే. ఇది కాకుండా సుందిళ్ల, అన్నారం బరా జ్‌లు, పంప్ హౌస్‌లు, అండర్ గ్రౌండ్ టన్నెళ్లు, రిజర్వాయర్లు, ఓపెన్ కెనాళ్లతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సిస్టమ్ అభివృద్ధి చేసి ఉన్నదని తెలిపారు. వీటన్నింటినీ పక్కకు పెట్టి కుంగిన మూడు పిల్లర్లను చూపి ఇదే మొత్తం ప్రాజెక్ట్ అని దుర్బుద్ధితో దుష్ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని మేడిగడ్డను సరిచేయాలి. లేకుంటే గడప గడపకూ వెళ్లి రైతులను చైతన్యం చేస్తాం.. ఇంటికో వంద మంది జమచేసి ఇంజనీర్ల సహకారంతో రైతులతోనే దీనిని రిపేర్ చేయించుకుంటాం. రాజకీయాన్ని, వ్యవసాయాన్ని కాంగ్రెస్




కలిపి చూడొద్దు.. ఏ ప్రభుత్వమైనా రైతుల కడగండ్లు తీర్చాలన్నారు. రైతుబంధు ఇవ్వకున్నా అప్పుచేసి సాగు చేశారు. ఇప్పుడు ఆ పంటలు ఎండిపోవడంతో రైతులు అవస్థప డుతు న్నారు అని నిరంజన్ రెడ్డి తెలిపారు.నీటి లభ్యత కోసమే మేడిగడ్డ బరాజ్‌నీటి లభ్యత కోసమే మేడిగడ్డ బరాజ్‌ను నిర్మించామని తెలిపారు. తుమ్మిడిహట్టిని వదిలిపెట్టింది అందుకే. ప్రాజెక్టు అంతిమలక్ష్యం రైతులకు సాగునీరు అందించడమే. 2007లో తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం సంకలి ్పంచింది. నాడు కేంద్రంలో, రాష్ట్రంలో, పక్కన ఉన్న మహారాష్ట్రలో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. కానీ నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను మహారాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ తిరస్కరించిందని గుర్తు చేశారు. 2007 నుండి 2014 వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క అనుమతి తీసుకోలేదు. అప్పుడు మంత్రిగా ఉన్న ఉత్తమ్ ఇప్పుడు కేసీఆర్ తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సి ఉండె అని మాట్లాడడం అత్యంత చెత్తగా, జుగు ప్సాకరంగా ఉందని ధ్వజమెత్తారు.కేసీఆర్ రికార్డు సమయంలో నిర్మించారు..కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అటు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని, ఇటు కేంద్రాన్ని ఒప్పించి.. కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో నిర్మించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాలతో పాటు రైతులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని తెలిపారు. కాంగ్రెస్ మాదిరిగా ప్రాజెక్టుల నిర్మాణం దశాబ్దాల పాటు సాగదీయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని జీర్ణించుకోలేక లేని అభాండాలని వేసి రాజకీయ లబ్ది కొరకు సత్య దూరం మాటలు మాట్లాడటం సిగ్గు చేటు అని మండిపడ్డారు. అనవసర పంతాలకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు ప్రయత్నం చేస్తుంది అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు.రైతుబంధు ఇచ్చేందుకు మూడు నెలల సమయంకేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో నీళ్లు ఇచ్చారు. 24 గంటల ఉచిత కరెంట్ అందించారు. పంట పెట్టుబడి కూడా సాయం చేశారు. పండిన పంటను కొనుగోలు చేసి రైతుల ముఖాల్లో కేసీఆర్ సంతోషం చూశారని నిరంజన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ రైతులకు కరెంట్ కటకట, నీటికి కటకట, రైతుబంధుకు కటకట ఏర్పడింది. మూడెకరాల వరకు రైతుబంధు ఇచ్చేందుకు మూడు నెలల సమయం తీసుకున్నారు. కాంగ్రెస్ వచ్చాక ఏర్పడిన దుర్భర పరిస్థితులను రాష్ట్ర ప్రజలు గమనించాలి అని నిరంజన్ రెడ్డి సూచించారు.

# పీబీబీఎల్‌తో కటీఫ్..

## ఆ ఒప్పందాల నుంచి విత్‌డ్రా అయ్యామన్న పేటీఎం..

**న్యూఢిల్లీ :** కేవైసీ తదితర రెగ్యులేటరీ నిబంధనలను అమలు చేయడంలో విఫలమైనందుకు ఆర్బీఐ నిషేధాన్ని ఎదుర్కొంటున్న పేటీఎం పేమెంట్స్ బ్యాంకింగ్ లిమిటెడ్ (పీబీపీఎల్)తో దాని మాతృ సంస్థ ఫిన్ టెక్ కంపెనీ పేటీఎం వన్97 కమ్యూనికేషన్స్ తెగదెంపులు చేసుకున్నది. పీబీబీఎల్‌తో తాము చేసుకున్న అంతర్గత ఒప్పందాలను ఉపసంహరించుకుంటున్నామని, ఈ విషయమై తమ మధ్య పరస్పర అంగీకారం కుదిరిందని శుక్రవారం తెలిపింది. కానీ పీబీబీఎల్‌కు, తమకు మధ్య కుదిరిన ఒప్పం దాలేమిటో బయట పెట్టలేదు. ఆర్థిక లావాదేవీల నిర్వహణలో పీబీబీఎల్ స్వతంత్ర నిర్వహణ సామర్థ్యం మెరుగు పర్చుకునేందుకు వీలుగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వన్97 కమ్యూ నికేషన్స్ తెలిపింది.ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో తమ ఖాతాదారులు, మర్చంట్లకు నిరంతరాయంగా ఆర్థిక లావాదేవీల సేవలు కొనసాగించడానికి యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ, యస్ బ్యాంక్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ తదితర బ్యాంకులతో పేటీఎం ఒప్పందాలు కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దీంతో పేటీఎం యాప్, క్యూఆర్ కోడ్, సౌండ్ బాక్స్ కార్డ్ మెషిన్లు యధాతథంగా పని చేస్తాయని పేటీఎం పేర్కొంది.రెగ్యులేటరీ నిబంధనలను అమలు చేయడంలో విఫలమైన పీబీబీఎల్.. ఆర్థిక లావాదేవీలు నిర్వహించకుండా గత జనవరి 31న ఆర్బీఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. తొలుత గత నెల 29 నుంచి ఖాతాదారుల నుంచి డిపాజిట్లు సేకరించరాదని, ప్రీ పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, వాలెట్లు, ఫాస్టాగ్‌లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులతో క్రెడిట్ లావాదేవీలు, టాపప్ రుణ వసతులు కల్పించరాదని పేటీఎంను ఆర్బీఐ ఆదేశించింది. అయితే, కస్టమర్లు, మర్చంట్ల సౌక





ర్యార్థం ఆంక్షల అమలు గడువును మార్చి 15 వరకూ పొడిగించింది.

# రామేశ్వరం కేఫ్‌లో జరిగింది బాంబు పేలుళ్లే..

## స్పష్టం చేసిన సీఎం సిద్ధరామయ్య

**బెంగళూరు :** కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలోని రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం మధ్యాహ్నం పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. అయితే మొదట గ్యాస్ సిలిండర్ పేలిందని అందరూ భావించారు. కానీ అది జరగలేదు. ఓ గుర్తు తెలియని వ్యక్తి కేఫ్‌లో ఉంచి వెళ్లిన బ్యాగులో పేలుడు సంభవించినట్లు కర్ణాటక ప్రభుత్వం నిర్ధారించింది. ఈ విషయాన్ని సీఎం సిద్ధరామయ్య అధికారికంగా ప్రకటించారు. ఓ వ్యక్తి కేఫ్‌లో బ్యాగు పెట్టి వెళ్లిన దృశ్యాలు అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని తెలిపారు. ఆ బ్యాగులో ఉన్న ఐఈడీ కారణంగానే పేలుళ్లు జరిగాయని పేర్కొన్నారు.9 మందికి తీవ్ర గాయాలు..ఈ పేలుడు ధాటికి 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు సంభవించిన వెంటనే భయంతో హోటల్ సిబ్బంది, కస్టమర్లు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. బాంబు స్క్వాడ్, క్లూస్ టీం అధికారులు అక్కడికి చేరుకుని ఆధారాలను సేకరించారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గాయపడ్డ వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు.రామేశ్వరం కేఫ్ ఫౌండర్‌కు ఎంపీ తేజస్వీ ఫోన్ కాల్‌ఈ ప్రమాదం జరిగిందని తెలుసుకున్న బెంగళూరు సౌత్ ఎంపీ తేజస్వీ సూర్య.. రామేశ్వరం కేఫ్ ఫౌండర్ నాగరాజ్‌కు ఫోన్ కాల్ చేశారు. కేఫ్‌లో గ్యాస్ సిలిండర్ పేలలేదని నాగరాజ్ స్పష్టం చేశారు. బాంబు బ్లాస్ట్ జరిగిందని, ఓ కస్టమర్ వదిలి పెట్టిపోయిన సంచిలో నుంచి పేలుడు సంభవించిందని ఆయన తెలిపారు. కేఫ్ సిబ్బంది ఒకరు తీవ్రంగా గాయపడినట్లు నాగరాజ్ పేర్కొన్నట్లు ఎంపీ సూర్య ట్వీట్‌లో తెలిపారు. ఈ




ఘటనపై సీఎం సిద్ధరామయ్య పూర్తి వివరణ ఇవ్వాలని ఎంపీ డిమాండ్ చేశారు.

# ఏపీ రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్..

## టీడీపీ, జనసేనకు హ్యాండిచ్చి ఆపరేషన్ ఆంధ్రప్రదేశ్‌పై బీజేపీ ఫోకస్!

**న్యూఢిల్లీ :**ఏపీ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుం టున్నాయి. సార్వత్రిక ఎన్నికల వేళ టీడీపీ-జనసేనకు బీజేపీ షాకిచ్చేందుకు సిద్ధమయ్యింది. నిన్నమొన్నటిదాకా టీడీపీ, జన సేన పొత్తు ఉంటుందని భావించినప్పటికీ.. ఇప్పుడు బీజేపీ సొం తంగానే ఎన్నికల బరిలోకి దిగాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీతో పాటు ఢిల్లీలో తాజాగా జరుగుతున్న పరిణామాలే ఇం దుకు నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే ఆపరేషన్ ఆం ధ్రప్రదేశ్ పేరుతో బీజేపీ కొత్త స్కెచ్ వేస్తున్నది. కాపు సీఎం నినా దంతో ఏపీ ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని బీజేపీ




హైకమాండ్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ ఎన్ని కల్లో బీసీ సీఎం నినాదంతో ముందుకెళ్లిన కాషాయ పార్టీ.. ఏపీలో కూడా కాపు సీఎం నినాదంతో ముం దుకెళ్తే సక్సెస్ అవు తామని అభిప్రాయపడినట్లు తెలు స్తోం ది.ఇప్పటికే తెలుగు దేశం పార్టీ నుంచి కమ్మ, వైసీపీ నుంచి రెడ్లు సీఎంలుగా ఉన్నారు. కానీ ఏపీలో అతిపెద్ద సామా జికవర్గమైన కాపుల్లో మాత్రం ముఖ్ యమంత్రులు లేరు. కాపు నేతగా పవన్ కళ్యాణ్‌కు మంచి గుర్తింపే ఉన్నప్పటికీ ఆయన సొంతంగా బరిలో దిగే ఆలోచనలో లేదు.

# అంచనాలను మించిన భారత్ ఆర్థికాభివృద్ధి




**న్యూఢిల్లీ :** డిసెంబర్‌తో ముగిసిన మూడవ త్రైమాసికంలో భారత్ ఆర్థికాభివృద్ధి అందరి అంచనాల్ని మించిపోయింది. గురువారం నేషనల్ స్టాటస్టికల్ ఆఫీస్ (ఎన్‌ఎస్‌వో) విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) 8.4 శాతం వృద్ధిచెందింది. తయారీ రంగం రెండంకెల్లో వృద్ధి చెందడం, మైనింగ్, నిర్మాణ రంగాలు మంచి పనితీరును కనపర్చడంతో ఈ వృద్ధి రేటు సాధ్యపడింది.ఇదే కాలంలో జీడీపీ 6.5 శాతం వృద్ధిచెందవచ్చని స్వయానా రిజర్వ్‌బ్యాంక్ గత అంచనాల్లో ప్రకటించగా, వివిధ ఆర్థిక నిపుణులు, రేటింగ్ ఏజెన్సీలు ఈ వృద్ధి 6-7.2 శాతం మధ్య ఉంటుందని అంచనాల్ని వెల్లడించారు. అంతకు ముందు జూలై-సెప్టెంబర్‌లో (క్యూ2) వృద్ధిని 7.6 శాతం నుంచి 8.1 శాతానికి, ఏప్రిల్-జూన్ (క్యూ1)లో వృద్ధి రేటును 7.8 శాతం నుంచి 8.2 శాతానికి తాజాగా ఎన్‌ఎస్‌వో సవరించింది. తయారీ రంగం మందగించడం, వినియోగంతగ్గడంవల్ల క్యూ3లో ఆర్థికాభివృద్ధి రేటు 7 శాతంలోపునకు పడిపోతుందని రాయిటర్స్ సర్వేలో విశ్లేషకులు అభిప్రాయపడగా, అందుకు భిన్నమైన గణాంకాలు వెలువడటం గమనార్హం.రూ.293.90 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ, పస్తుత 2023-24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాల్ని ఎన్‌ఎస్‌వో 7 శాతం నుంచి 7.6 శాతానికి పెంచింది. ఇది 2011-12 స్థిర ధరల ప్రకారం రూ.172.90 లక్షల కోట్లు. 2022-23 సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం వాస్తవ జీడీపీ రూ.160.71 లక్షల కోట్లు. ఈ అంచనా గణాంకాలకు అనుగుణంగా 2023-24లో వృద్ధి 7.6 శాతం పెరుగుతున్నట్టవుతుందని ఎన్‌ఎస్‌వో వివరించింది. 2022-23లో ఇది 7 శాతంగా ఉంది. ఇక ప్రస్తుత ధరల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ రూ.293.90 లక్షల కోట్లకు చేరుతుందని ఎన్‌ఎస్‌వో అంచనా వేసింది.2022-23లో ఇది రూ.269.50 లక్షల కోట్లుగా ఉంది. ఈ ధరల ప్రకారం జీడీపీ 9.1 శాతం వృద్ధి రేటును ప్రదర్శిస్తుంది. క్యూ3లో స్థిర ధరల (2011-12) మేరకు జీడీపీ రూ.43.72 లక్షల కోట్లుకాగా, 2022-23 అక్టోబర్-డిసెంబర్‌లో నమోదైన 40.35 లక్షల కోట్లతో పోలిస్తే 8.4 శాతం వృద్ధి నమోదైనట్టు. ప్రస్తుత ధరల ప్రకారం క్యూ3 జీడీపీ రూ.75.49 లక్షల కోట్లుకాగా, 2022 -23 క్యూ3 లో నమోదైన రూ.68.58 లక్షల కోట్లకంటే ఇది 10.1 శాతం అధికం.

# దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గుముఖం




**న్యూఢిల్లీ :** దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గుముఖం పట్టాయి. గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్‌లో 13 శాతం క్షీణించి 32.03 బిలియన్ డాలర్లకే పరిమి తమ య్యాయి. అంతకుముందు ఏడాది (2022) ఇదే వ్యవధిలో 36.74 బిలియన్ డాలర్లుగా ఉండటం గమనార్హం. అయితే 2023 అక్టోబర్-డిసెంబర్‌లో ఎఫ్‌డీఐ గతంతో పోల్చితే 18 శాతం పెరిగి 11.6 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2022 అక్టోబర్-డిసెంబర్‌లో 9.83 బిలియన్ డాలర్లే. కానీ ఏప్రిల్-జూన్, జూలై-సెప్టెంబర్ త్రైమాసికాల్లో క్షీణత ప్రభావితం చేసినట్టు తాజా ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. అధిక వడ్డీరేట్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా ఎఫ్‌డీఐ పతనానికి కారణమేనన్న అభిప్రాయాలు ప్రభుత్వ వర్గాల నుంచి విని పిస్తున్నాయి. కాగా, 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐ 22 శాతం పడిపోయి 46 బిలియన్ డాలర్లుగానే ఉన్న విషయం తెలిసిందే.ఆయా రంగాల్లో..కంప్యూటర్ హార్డ్‌వేర్-సాఫ్ట్‌వేర్, ట్రేడింగ్, సేవలు, టెలికం, ఆటో, ఔషధ, రసాయన రంగాల్లో ఎఫ్‌డీఐలు దిగజారినట్టు తేలింది. నిర్మాణ రంగ కార్యకలాపాలు, అభివృద్ధి, విద్యుత్తు రంగాల్లోకి ఎఫ్‌డీఐ పెరిగినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే క్షీణత నమోదైనట్టు పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) చెప్తున్నది. ఇదిలావుంటే నిరుడు ఏప్రిల్-డిసెంబర్‌లో ఈక్విటీ మార్కెట్లు, ఇతరత్రా పెట్టుబడులు కలుపుకొని దేశంలోకి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐని పరిగణనలోకి తీసుకుంటే 51.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2022 ఏప్రిల్-డిసెంబర్‌తో పోల్చితే దాదాపు 7 శాతం తగ్గాయి. నాడు 55.27 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.ఆయా దేశాల నుంచి..గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్‌లో భారత్‌లోకి సింగపూర్ నుంచి వచ్చిన ఎఫ్‌డీఐలు పడిపోయాయి. అమెరికా, బ్రిటన్, సైప్రస్, యూఏఈ దేశాల నుంచీ తగ్గుముఖం పట్టా యి. ప్రధానంగా కేమన్ ఐస్‌లాండ్స్ నుంచి ఎఫ్‌డీఐలు 215 మిలియన్ డాలర్ల వద్దే ఉండగా, సైప్రస్ నుంచి వచ్చినవి 796 మిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. నిజానికి 2022 ఏప్రిల్-డిసెంబర్‌లో భారత్‌కు కేమన్ ఐస్‌లాండ్స్ నుంచి 624 మిలియన్ డాలర్లు, సైప్రస్ నుంచి 1.15 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చింది. అయితే మారిషస్, నెదర్లాండ్స్, జపాన్, జర్మనీ నుంచి ఎఫ్‌డీఐ రాక పెరిగింది.తెలంగాణకు పెరిగాయ్..

2023 ఏప్రిల్-డిసెంబర్ వ్యవధిలో ఆయా దేశాల నుంచి తెలంగాణకు వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2022 ఇదే వ్యవధితో పోల్చితే పెరిగినట్టు తాజా గణాంకాల్లో కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. గుజరాత్, జా ర?ండ్ రాష్ట్రాలకూ ఎఫ్‌డీఐలు చెప్పుకోదగ్గ రీతిలోనే వచ్చా య న్నది. అయితే రాష్ట్రాలవారీగా మహారాష్ట్రలోకి అత్యధికంగా 12.1 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చింది. మునుపు 10.76 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. కానీ గతంతో పోల్చితే కర్ణా టకకు 8.77 బిలియన్ డాలర్ల నుంచి 3.6 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. ఢిల్లీ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలూ ఎఫ్‌డీఐలను పెద్దగా ఆకట్టు కోలేకపోయాయి.

# ఆ రెండూ ఒకటైతే ధరల మోతే..

## రిలయన్స్-డిస్నీ విలీనంతో మీడియా, వినోద రంగంపై ప్రతికూల ప్రభావం!




**న్యూఢిల్లీ :** భారతీయ మీడియా, వినోద రంగంపై రిలయన్స్-డిస్నీ విలీనం పెద్ద ఎత్తునే ప్రతికూల ప్రభావం చూపవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ వయకామ్18తో వాల్ట్ డిస్నీ దేశీయ మీడియా వ్యాపార కార్యకలాపాలు ఏకమవుతున్న విషయం తెలిసిదే. ఇదే జరిగితే దేశీయ మీడియా, వినోద రంగంలో గుత్తాధిపత్యం రాజ్యమేలుతుందని, ఫలితంగా సబ్‌స్ర్కైబర్లకు ఇప్పటిదాకా అందుతున్న తక్కువ చార్జీల ప్రయోజనాలు క్రమేణా దూరం కాగలవని ఈ రంగ నిపుణులు అంటున్నారు. వ్యాపారులు సైతం తమ వాణిజ్య ప్రకటనల కోసం బేరాలాడే శక్తిని కోల్పోవచ్చని, దీనివల్ల ప్రకటనల వ్యయం పెరిగి వినియోగదారులపై ఆ భారం పడవచ్చని చెప్తున్నారు. రిలయన్స్-డిస్నీ దేశీయ మీడియా కార్యకలాపాల విలీనంతో రూ.70,000 కోట్ల కొత్త సంస్థ ఆవిర్భవించనున్నది.వచ్చే ఏడాది మార్చికల్లా కావాల్సిన అనుమతులు వస్తాయని అంచనా. ఇక ఇందులో ఓటీటీ మార్కెట్ బడా వేదికలైన జియో సినిమా, డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లతోపాటు స్టార్ గ్రూప్‌నకు చెందిన అన్ని చానళ్లు, టీవీ18 ఆధ్వర్యంలోని చానళ్లు ఉండనున్నాయి. మొత్తంగా 12 0 చానళ్లు, 2 ఓటీటీలు, రిలయన్స్, డిస్నీలకు చెందిన 2 ఫిల్మ్ స్టూడియోలు ఒకే సంస్థ పరిధిలోకి రానున్నాయి. దీంతో మార్కెట్‌లో పోటీ వాతావరణం తగ్గిపోతుందని, మెజారిటీ టెలివిజన్ చానళ్లు ఒక్కరివే అయితే వారు నిర్ణయించిన ధరలకే చానళ్లను సబ్‌స్ర్కైబర్లు కొనుక్కోవాల్సి వస్తుందని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. వీటిల్లో యాడ్స్ ఇవ్వాలన్నా వ్యాపారులు ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తుందని, చివరకు ఇది ఆయా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు దారి తీయవచ్చన్న ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో సన్, జీ, సోనీ ఇతర సంస్థల వాటా గణనీయంగా తగ్గుతుందని, ఇది పోటీ మార్కెట్ పరిస్థితులకు ఏమంత మంచిది కాదనీ అంటున్నారు.భారతీయ టెలివిజన్ ప్రేక్షకుల సరదా కాలం ఇక ముగిసిపోనున్నది. అటు డిజిటల్, ఇటు సంప్రదాయ టీవీ చానళ్ల ధరలు పెరిగే వీలున్నది మరి. మెజారిటీ చానళ్లు ఒక్కరి దగ్గరే ఉండటం వల్ల వాటిలో ప్రకటనలూ ఖరీదెక్కుతాయి.

అంతిమంగా ఇది ఆయా ఉత్పత్తుల వినియోగదారులపైనే భారం.-అభ్నీశ్ రాయ్, నువమా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ ఈడీస్పోర్ట్స్ చానళ్లలో గుత్తాధిపత్యం ఆయా ప్రకటనల వ్యయాన్ని అమాంతం పెంచేయగలదు. డి స్నీ, జియోల చేతిలోనే దాదాపు 75-80 శాతం భారతీయ క్రీడా మార్కెట్ ఉంటున్నది. ఐపీఎల్, ఐసీసీ క్రికెట్ టోర్న మెంట్లు, వింబుల్డన్, ప్రో కబడీ లీగ్, బీసీసీఐ దేశవాళీ క్రికెట్ పోటీలన్నీ ప్రసారం చేసే హక్కులు రిలయన్స్-డిస్నీ చానళ్ల చేతిలోనే ఉంటున్నాయి.

# ఇన్‌ఫినిక్స్ నుంచి బడ్జెట్ ఫ్రెండ్లీ ఫోన్

## 'ఇన్‌ఫినిక్స్ స్మార్ట్ 8 ప్లస్'.. ఇవీ డిటైల్స్..!




**హైదరాబాద్ :** ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ ఇన్‌ఫినిక్స్ తన ఇన్‌ఫినిక్స్ స్మార్ట్ 8 ప్లస్ ఫోన్‌ను శుక్రవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరి ంచింది. ఈ ఫోన్ మ్యాజిక్ రింగ్ ఫీచర్, ఏఐ బ్యాక్డ్ డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ తో వస్తున్నది. ఆండ్రాయిడ్ 13 గో ఎడిషన్ వర్షన్ మీద పని చేస్తుంది.గెలాక్సీ వైట్, షైనీ గోల్డ్, టింబర్ బ్లాక్ కలర్ ఆప్షన్లలో లభిస్తుందీ ఇన్‌ఫినిక్స్ స్మార్ట్ 8 ప్లస్ 4 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర రూ.7,999 పలుకుతుంది. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి ఫ్లిప్ కార్ట్ ద్వారా సేల్స్ ప్రారంభం అవుతాయి. సెలెక్టెడ్ బ్యాంక్ కార్డులపై రూ.1000 డిస్కౌంట్ కూడా పొందొచ్చు.ఇన్‌ఫినిక్స్ స్మార్ట్ 8 ప్లస్ ఫోన్.. 180 హెర్ట్జ్ టచ్ శాంప్లింగ్ రేట్, 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్‌తోపాటు 6.6-అంగుళాల హెచ్డీం (1612ఐ720 పిక్సెల్స్) డిస్ ప్లే కలిగి ఉంటుంది. 500 నిట్స్ పీక్ బ్రైట్ నెస్ కలిగి ఉంటుంది. 12ఎన్ఎం మీడియాటెక్ హెలియో జీ36 ఎస్వోసీ చిప్ సెట్ కలిగి ఉంట ంది. 4జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ కలిగి ఉంటుంది. వర్చువల్‌గా మరో 4జీబీ ర్యామ్ పెంచుకోవచ్చు. మైక్రో ఎస్డీ కార్డు సాయంతో 2 టిగా బైట్ల వరకూ స్టోరేజీ కెపాసిటీ పెంచుకోవచ్చు. ఆండ్రాయిడ్ 13 గో ఎడిషన్ బేస్డ్ ఎక్స్ఓఎస్ 13 వర్షన్ మీద ఈ ఫోన్ పని చేస్తుంది.

# యూపీలో 12వ తరగతి పరీక్షా పేపర్లు లీక్..

## కేసు నమోదు



**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో 12వ తరగతి బోర్డు పరీక్షా పేపర్లు లీక్ అయ్యాయి. గురువారం జరిగిన గణితం, జీవశాస్త్రం పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు వాట్సాప్ గ్రూప్‌లో షేర్ అయ్యాయి. అయితే పరీక్ష ప్రారంభమైన గంట తర్వాత ఇవి లీక్ అయ్యినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్ ఆగ్రా జిల్లాలోని ఫతేపూర్ సిక్రిలో ఈ సంఘటన జరిగింది. రాజహౌలీలోని అతర్ సింగ్ ఇంటర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కుమారుడు 'ఆల్ ప్రిన్సిపాల్స్ ఆగ్రా' వాట్సాప్ గ్రూప్‌లో మ్యాథ్స్, బయోలజీ పరీక్షా పేపర్లు షేర్ చేసినట్లు గుర్తించారు. దీంతో ఆ కాలేజీ ప్రిన్సిపాల్, కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అతడి కుమారుడుతోపాటు మరి కొందరిపై జిల్లా విద్యా శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు.

# మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు



**హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ వద్దకు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. బరాజ్ వద్ద గేట్లను మూసివేసి, బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నేతలు గేట్లను తోసుకుంటూ ముం దుకు వెళ్లారు. మేడిగడ్డలో కుంగిన పియర్‌ను నేతలు పరిశీలించారు. మేడిగడ్డ పరిశీలనకు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి, ప్రశాంత్ రెడ్డి, దయాకర్ రావు, నిరంజన్ రెడ్డితో పాటు పలువురు నాయకులు వెళ్లారు.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు బీఆర్ఎస్ సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం మేడిగడ్డ పర్యటనకు శుక్రవారం ఉదయం ప్రత్యేక బస్సుల్లో బయల్దేరారు.

# ఓపెన్‌ఏఐ సీఈఓ తదితరులపై ఎలన్ మస్క్ కేసు..!



**న్యూఢిల్లీ :**టెస్లా కార్లు 'ఎక్స్ (మాజీ ట్విట్టర్) అధినేత ఎలన్ మస్క్ ఏం చేసినా సంచలనమే. రెండేండ్ల క్రితం టెక్నాలజీ రంగంలో సంచలనం నెలకొల్పిన చాట్‌బోట్ 'చాట్ జీపీ టీ' పేరెంట్ సంస్థ ఓపెన్‌ఏఐ లో పెట్టు బడులు పెట్టారు ఎలన్ మస్క్. నాడు 2015లో మానవులకు లబ్ధి చేకూ రుస్తుందన్న పేరుతో ప్రారంభించిన నాన్ ప్రాఫిట్ సంస్థ 'ఓపెన్ ఏఐ'.. తనతో చేసుకున్న కాంట్రాక్ట్ ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నదంటూ ఎలన్ మస్క్ ఆరోప ణలు గుప్పించారు.ఓపెన్‌ఏఐ శా మ్ ఆల్టమన్,

తదితరులపై శాన్ ఫ్రాన్సిస్కోలో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. గతంలో నాన్ ప్రాఫిట్ సంస్థగా రిజిస్టర్ చేసుకున్న ఓపెన్ ఏఐ' ఇప్పు డు లాభాల స్వీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నదని ఆ పిటిషన్‌లో ఆరోపించారు.ఎలన్ మస్క్ ఆరో పణలపై మైక్రోసాఫ్ట్ గానీ, మైక్రోసాఫ్ట్ గానీ స్పందించేదు.2015లో ఎలన్ మస్క్ సహా వ్యవ స్థాపకుడిగా ఓపెన్ ఏఐలో పెట్టుబడులు పెట్టిన, 2018లో నిధులను ఉపసంహరించుకున్నారు.


# దేశీ స్వీట్ మేకింగ్ వీడియోతో నెట్టింట దిల్జిత్ దోసాంజ్ సందడి



**హైదరాబాద్ :** నటుడు, గాయకుడు దిల్జిత్ దోసాంజ్ అమెరికా పర్యటనకు ముందు ఇండియన్ స్వీట్ డిష్ తయారుచేస్తూ నెట్టింట సందడి చేశాడు. వైరల్ క్లిప్‌లో దిల్జిత్ దోసాంజ్ తన కుకింగ్ స్కిల్స్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నాడు.మరో ఫుడీ వీడియోతో దోసాంజ్ నెటిజన్లను ఆకట్టుకున్నాడు. ఈ వైరల్ వీడియోలో దోసాంజ్ సంప్రదాయ పంజాబీ స్వీట్ డిష్ పంజిరి తయారుచేశాడు. రానున్న తన కన్సర్ట్‌కు ఇప్పటికే 20000 టికెట్స్ బుక్ అయ్యాయని ఈ వీడియోలో దిల్జిత్ చెబుతుండటం వినిపిస్తుంది.సింగర్ మొత్తం వంటకాన్ని నెయ్యితో చేయడం ఆకట్టుకుంటుంది. డిష్‌కు మరింత స్వీట్‌నెస్ కోసం దోసాంజ్ బ్రౌన్ షుగర్‌ను జోడించడం చూడొచ్చు. ఆపై అన్ని పదార్థాలను సరైన రీతిలో మిక్స్ చేయడం కనిపిస్తుంది.

# సింద్రీ ప్లాంట్‌ను నెహ్రూ ప్రారంభించారు..

## మోదీ క్రెడిట్ పొందుతున్నారు: జైరాం రమేష



**న్యూఢిల్లీ:** జార?ండ్‌లో పునరుద్ధరించిన సింద్రీ ఎరువుల కర్మాగారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. రూ.8,900 కోట్లకు పైగా వ్యయంతో తిరిగి అభివృద్ధి చేసిన ఈ ప్లాంట్‌ను జాతికి అంకితం చేశారు. 2018లో తాను ఇచ్చిన హామీని తాజాగా నెరవేర్చినట్లు మోదీ తెలిపారు. ఏడాదికి సుమారు 12.7 ఎల్ఎంటీ యూరియా ఉత్పత్తి చేసే ఈ ప్లాంట్ దేశంలోని రైతులకు ప్రయోజనం చేకూర్చుతుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, తెలంగాణలోని రామగుండంలో ఎరువుల కర్మాగారాల పునరుద్ధరణ తర్వాత దేశంలో పునరుద్ధరించిన మూడవ ఎరువుల కర్మాగారం సింద్రీ ప్లాంట్ అని మోదీ అన్నారు.కాగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఈ సందర్భంగా శుక్రవారం ఎక్స్‌లో రెండు ఫొటోలు షేర్ చేశారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1952 మార్చ్‌లో సింద్రీ ప్లాంట్ ప్రారంభోత్సవం చేసిన ఫొటోలుగా ఆయన పేర్కొన్నారు. నెహ్రూ 1952లో సింద్రీ ప్లాంట్‌ను ప్రారంభించగా, ప్రధాని మోదీ ఇవాళ ఆ క్రెడిట్ పొందేందుకు ప్రయత్నించారని అందులో విమర్శించారు.మరోవైపు 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మూసివేసిన దేశంలోనే మొట్టమొదటి ప్రభుత్వ రంగ సంస్థ సింద్రీ ఎరువుల కర్మాగారం కావడం విశేషం. అయితే 22 ఏళ్ల తర్వాత ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ ప్లాంట్‌ను పునరుద్ధరించింది.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ జూనియర్ అకౌంట్ అధికారి



**హైదరాబాద్ :** విద్యుత్ శాఖలో జూనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగి ఒకరు లంచం తీసుకుంటూ ఏసీబీఅ ధికారులకు రెడ్ హ్యాం డెడ్‌గా చిక్కా డు. పూర్తి వివరాలు.. హైద రాబాద్ హబ్సిగూడలోని టీఎ స్ఎస్పీడీసీ ఎల్ జూని యర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వ హిస్తున్న సామ వి జయ సింహా రెడ్డి అనే ఉద్యోగి రూ. 35,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.అదేశాఖలో ఆర్టిజన్‌గా పనిచేసిన భరత్ తనకు రావాలసిన బకాయిల కోసం జూనియర్ అకౌంటెంట్‌ను సంప్రదించగా డబ్బులు డిమా ండ్ చేశాడు. దీంతో సదరు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా శుక్రవారం మధ్యా హ్నం ఏసీబీ అధికారులు హబ్సిగూడ కార్యాలయంపై దాడి చేసి లంచం తీసుక ుం టుండగా ఏవోను పట్టుకున్నారు.ఏవో వద్ద నుంచి రూ.35 వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు లం చం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

# సెన్సెక్స్ సరికొత్త రికార్డు.. అదే బాటలో నిఫ్టీ..!

**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ–30 ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ–50 సూచీ నిఫ్టీ శుక్రవారం సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. దేశీయ ఆర్థిక వృద్ధిరేటు ఊహించిన దానికన్నా మెరుగ్గా పుంజుకోవడం, అమెరికా ద్రవ్యోల్బణం అంచనాలకు అనుగుణంగా ఉండటంతో ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ బలపడింది. దీంతో బ్లూచిప్ ఇండెక్స్ ఎన్ఎస్ఈ నిఫ్టీ–50.. 356 పాయింట్లు (1.6శాతం) పెరిగి 22,339 పాయింట్ల వద్ద, బీఎస్ఈ–30 సూచీ సెన్సెక్స్ 1245 (1.72శాతం) పాయింట్లు పుంజుకని 73,745 పాయింట్ల వద్ద ముగిసింది.దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.16 లక్షల కోట్లు పెరిగి రూ.392.11 లక్షల కోట్లకు చేరుకున్నది. ఐటీ మినహా మీడియా, ఫార్మా అండ్ హెల్త్ కేర్ మినహా అన్ని సెక్టోరల్ ఇండెక్సులు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ బ్యాంకు, ఆటో, ఫైనాన్సియల్ సర్వీసెస్, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్సులు రెండు శాతానికి పైగా లాభ పడ్డాయి. స్మాల్ అండ్ మిడ్ క్యాప్ ఇండెక్స్ లు దాదాపు ఒక శాతం చొప్పున లాభ పడ్డాయి.ఇండెక్సులు పుంజుకోవడానికి కారణాలివి..

అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో భారత వృద్ధిరేటు 8.4 శాతానికి పెంచుకున్నది. గత ఆరు త్రైమాసికాల్లో శరవేగంగా సాధించిన ప్రగతి ఇది. మాన్యుఫాక్చరింగ్, నిర్మాణ రంగ కార్యకలాపాలు పుంజుకోవడం కలిసి వచ్చింది. జూన్ నెలలో అమెరికా ఫెడ్ రిజర్వు, యూరోపియన్ యూనియన్ సెంట్రల్ బ్యాంక్ రుణ ఖర్చులు తగ్గించనుండడంతో యూరప్ స్టాక్స్ 600 పాయింట్లు పుంజుకున్నది. జపాన్ నిక్కీ 1.9 శాతం పెరిగి తాజా ఆల్ టైం గరిష్టానికి చేరుకున్నాయి. గురువారం విదేశీ సంస్థాగత ఇన్వె స్టర్లు రూ.3,568 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేస్తే, దేశీయ



సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.230 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. గత నెలలో ఇండియన్ ఈక్విటీల్లో విదేశీ ఇన్వెస్టర్లు రూ.5,107 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు.

# అంబానీ ఇంట పెళ్లి వేడుకలు..

## జామ్‌నగర్‌లో ప్రముఖుల సందడి

**గుజరాత్ :** గుజరాత్ రాష్ట్రంలోని జామ్‌నగర్ సందడి వాతావరణం నెలకొంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, అపర కుబేరుడు ముకేశ్ అంబానీ నీతా అంబానీ దంపతుల చిన్న కుమారుడు అనంత్ అంబానీ రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకలు ఇవాళ జామ్ నగర్‌లో మరికాసేపట్లో ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అతిథులు ఒక్కొక్కరుగా జామ్‌నగర్ చేరుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతం అంతా ప్రముఖులతో సందడిగా మారింది.అనంత్ అంబానీ వివాహం రాధిక మర్చంట్ జులై 12న జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అంబానీ ఇంట ప్రీ వెడ్డింగ్ వేడుకలు షురూ అయ్యాయి. ఈ ముందస్తు వివాహ వేడుకలను గుజరాత్ జామ్‌నగర్ నిర్వ హిస్తున్నారు. ఇప్పటికే అంబానీ ఫ్యామిలీ మొత్తం జామ్‌నగర్ చేరుకుంది. ఇక అతిథులు సైతం ఒక్కొక్కరుగా జామ్‌నగర్ చేరుకుంటున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రీ వెడ్డింగ్ వేడుకల్లో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొనబోతున్నారు.ఆహ్వానం అందిన వారిలో మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్, తన సతీమణి ప్రిసిల్లా చాన్, పాప్ సింగర్ రిహన్నా, బాలీవుడ్ తారలు రణ్‌వీర్ దీపిక, ఆలియా భట్–రణబీర్ కపూర్, రాణీ ముఖర్జీ, షారుక్ ఖాన్ కుటుంబం, అర్జున్ కపూర్, దర్శ్ంుడు అట్లీ, ప్రముఖ క్రికెటర్ ధోనీ సాక్షి దంపతులు, స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్– పారుపల్లి కశ్యప్, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, క్రికెటర్ సూర్యకుమార్ దంపతులు, ఇషాన్ కిషన్, జహీర్ ఖాన్– సాగరిక దంపతులు, మహా రాష్ట్ర డిప్యూటీ




సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ భార్య అమృతా ఫడ్నవీస్, బాలీవుడ్ ప్రముఖ జామ్‌నగర్ చేరుకున్నారు.

# అనంత్ అంబానీ రాధిక మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకలు..

## ప్రత్యేక సందేశాన్నిచ్చిన నీతా అంబానీ

**న్యూఢిల్లీ:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, అపర కుబేరుడు ముకేశ్ అంబానీ ఇంట పెళ్లి సందడి మొదలైంది. ముకేశ్ అంబానీ–నీతా అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ వివాహం రాధిక మర్చంట్ జులై 12న జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తా జాగా అంబానీ ఇంట ప్రీ వెడ్డింగ్ వేడుకలు షురూ అయ్యాయి. ఈ ముందస్తు వివాహ వేడుకలను గుజరాత్ జామ్‌నగర్ నిర్వ హిస్తున్నారు. ఇప్పటికే అంబానీ ఫ్యామిలీ మొత్తం జామ్‌నగర్ చేరు కుంది. ఇక అతిథులు సైతం ఒక్కొక్కరుగా జామ్‌నగర్ చేరు కుంటున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రీ వెడ్డింగ్ వేడుకల్లో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొ నబోతు న్నారు.ఇక వేడుకల ప్రారంభం సందర్భంగా ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ ప్రత్యేక వీడియో సందేశానిచ్చారు. ఈ పెళ్లి విషయంలో తనకు రెండు ముఖ్యమైన కోరికలు ఉన్నట్లు చెప్పారు. అందులో ఒకటి తమ మూలాలను గుర్తించుకునేలా వేడుకలను ఘనంగా నిర్వహించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇంకోటి.. ఈ వేడుక మన కళలు, సంస్కృతి, దేశ వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలని



తాము కోరుకున్నట్లు వివరించారు.ముందస్తు వివాహ వేడుకలకు ఆహ్వానాలు అందిన వారిలో బాలీ వుడ్ ప్రముఖులు అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్ సహా క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీ ఉన్నారు. వ్యాపార దిగ్గజాల్లో మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్, అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, బ్లాక్ రాక్ సీఈఓ లారీ ఫింగ్, అ డ్నాక్ సీఈఓ సుల్తాన్ అహ్మద్, వాల్ట్ డిస్నీ సీఈఓ బాబా ఐగర్ వంటి వారు ఉన్నారు. అలాగే దేశీయ వ్యాపార దిగ్గజాల్లో గౌతమ్ అదానీ, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, గోద్రేజ్ కుటుంబం, ఇన్ఫోసిస్ ఛైర్మన్ నందన్ నీలేకనీ, బిర్లా గ్రూప్ ఛైర్ పర్సన్ కుమార్ మంగళం బిర్లా, ఆర్పీఎస్‌జీ గ్రూప్ హెడ్ సంజీవ్ గోయెంకా, అదర్ పూనావాలా, సునీల్ మిట్టల్, పవన్ ముం జాల్, నిఖిల్ కామత్, దిలీప్ సంఘ్వీ వంటి వారు ఉన్నారు.ఆహ్వానం అందిన వారు ఇప్పటికే జామ్‌నగర్ చేరుకుంటున్నారు. మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్, తన సతీమణి ప్రిసిల్లా చాన్, పాప్ సింగర్ రిహన్నా, బాలీవుడ్ తారలు రణ్‌వీర్ దీపిక, ఆలి యా భట్–రణబీర్ కపూర్, రాణీ ముఖర్జీ, షారుక్ ఖాన్ కుటుంబం, అర్జున్ కపూర్, దర్శకుడు అట్లీ తదితరులు ఇప్పటికే జామ్‌నగర్ చేరుకున్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత ప్రీవెడ్డింగ్ వేడుకలు ప్రారంభం కాను న్నాయి.అతిథులకు 2,500 రకాల వంటకాలు..మరోవైపు ఈ వేడకల్లో అతిథులకు పసందైన వంటకాలు వడ్డించనున్నారు. ఏకంగా 2,500 వంటకాలను వడ్డించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# రాడిసన్ డ్రగ్స్ కేసులో ట్విస్ట్ ..

## ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో క్రిష్ పిటిషన్

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన రాడిసన్ డ్రగ్స్ కేసు ఊహించని మలుపులు తిరుగుతోంది. ఈ డ్రగ్స్ పార్టీలో టాలీవుడ్ సినీ డైరెక్టర్ జాగర్లమూడి క్రిష్ కూడా ఉన్నట్టు పోలీసులు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇక క్రిష్ ను విచారించేందుకు పోలీసులు సిద్ధం అయ్యారు. క్రిష్ వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాల్సిందేనని పోలీసులు తెలిపారు.



అయితే గచ్చిబౌలి పోలీసుల విచారణకు హాజరుకాకుండా హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు క్రిష్.ఇక ఈ పిటిషన్‌లో "వివేకానంద ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో నన్ను నిందితుడిగా చేర్చారని క్రిష్ పేర్కొన్నాడు. నాకు డ్రగ్స్ పార్టీతో సంబంధమే లేదు. నేను డ్రగ్స్ తీసుకున్నాననడానికి ఆధారాలు లేవు. కావాలనే నన్ను ఈ కేసులో ఇరికించారు.

# 10 ఇండియన్ యాప్ కంపెనీలపై గూగుల్ సీరియస్



**న్యూఢిల్లీ:** దేశంలోని పది యాప్ డెవలపింగ్ కంపెనీలపై గూగుల్ సంస్థ సీరియస్ అయ్యింది. ప్లే స్టోర్ నుంచి ఆ కంపెనీల యాప్‌లను తొలగించనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఆ పది కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పింది. ప్లే స్టోర్ విధానానికి వ్యతిరేకంగా ఆ యాప్ కంపెనీలు వ్యవహరిస్తున్నట్లు గూగుల్ సంస్థ ఆరోపించింది. ఆ జాబితాలో ప్రఖ్యాత కంపెనీలు కూడా ఉన్నట్లు గూగుల్ తెలిపింది. ఎన్ని సార్లు డెడ్‌లైన్ పొడిగించినా.. ఆ యాప్ కంపెనీలు ప్లే స్టోర్‌కు ఫీజులు చెల్లించడంలేదని గూగుల్ పేర్కొన్నది. పది డెవలపర్స్‌కు చెందిన యాప్‌లను త్వరలోనే గూగుల్ ప్లే స్టోర్ నుంచి డీలిస్ట్ చేయనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇటీవల ఫోన్ పే కొత్తగా ఇండస్ యాప్ స్టోర్‌ను ప్రారంభించింది. యాప్ డెవలపర్స్‌కు ఫ్రీగా డిజిటల్ మార్కెట్‌ను కల్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే గూగుల్ సంస్థ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గూగుల్‌లో గేట్‌కీపింగ్ ఫీజులు, ఎక్స్‌ట్రా కమీషన్లు ఎక్కువగా ఉన్నాయని యాప్ డెవలపర్లు ఆరోపిస్తున్నారు. కానీ గూగుల్ సంస్థ ఆ ఆరోపణలను కొట్టిపారేసింది. యాప్ డెవలపర్ల వద్ద నుంచి అతి తక్కువ ఛార్జీలు వసూల్ చేస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది.

# వినియోగదారులకు షాక్..

## పెరిగిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర

**న్యూఢిల్లీ:**ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు మరోసారి షాక్ ఇచ్చాయి. వాణి జ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను పెంచాయి. 19 కేజీల సిలిండర్‌పై రూ.25.50 పెరిగింది. ఈ మేరకు



ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు శుక్రవారం ప్రకటించాయి. పెరిగిన ధరలు నేటి నుంచి అంటే మార్చి 1 నుంచే అమల్లోకి రానున్నట్లు వెల్లడించాయి.ధరల పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,795కు చేరింది. ముంబైలో ఇది రూ. 1,749కి చేరగా.. కోల్ కతా లో రూ. 1,911, చెన్నైలో రూ.1,960.50 గా ఉంది. ఇక హైదరాబాద్ మహా నగరంలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర గరిష్ట స్థాయిలో రూ. 2,027 వద్ద ఉండటం గమనార్హం. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉం టాయి.అయితే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదని చ ము రు కంపెనీలు వెల్లడించాయి. మరోవైపు వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరల్ని పెం చిన క్రమ ంలో విమానయాన ఇంధన ధరలను కూడా ఆయిల్ కంపెనీలు పెంచాయి. డొమె స్టిక్ ఎయిర్‌లైన్స్‌కు ఏటీఎఫ్ ధర ఢిల్లీలో కిలోలీటర్‌కు రూ. 1,01,397కు పెరిగింది. కోల్‌కతాలో ఇది రూ. 1,10,297 గా ఉంది. ఇక ముంబై, చెన్నైలో దేశీయ విమానయాన సంస్థలకు ఏటీఎఫ్ ధరలు వరుసగా కిలోలీటర్‌కు రూ.94,809, రూ.1,05,399కి పెరిగింది.

# మందగించిన మౌలికం..

## జనవరిలో 15 నెలల కనిష్ఠానికి పతనం



**న్యూఢిల్లీ :** దేశంలో మౌలిక రంగాల వృద్ధి నెమ్మదించింది. జనవరిలో 15 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 8 కీలక రంగాల వృద్ధిరేటు 3.6 శాతంగానే నమోదైంది. రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, విద్యుత్తు తదితర రంగాల్లో పనితీరు పేలవంగా ఉండటమే ఇందుకు కారణమని గురువారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు తదితర 8 కీలక రంగాల్లో వృద్ధిరేటు గత ఏడాది డిసెంబర్‌లో 4.9 శాతంగా ఉన్నది.

నిరుడు జనవరిలోనైతే ఇది 9.7 శాతం. ఇదిలావుంటే 2022 అక్టోబర్‌లో 0.9 శాతంగా ఈ 8 కీలక రంగాల వృద్ధిరేటు నమోదైంది. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయి కనిష్ఠానికి దిగజారింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) ఏప్రిల్–జనవరిలో కీలక రంగాల వృద్ధిరేటు 7.7 శాతంగా ఉన్నది. అయితే గత ఆర్థిక సంవత్సరం (2022–23) ఇదే వ్యవధిలో 8.3 శాతంగా ఉన్నది.ప్రతికూలతలోకి..రిఫైనరీ, ఎరువుల రంగాల్లో ఉత్పాదక వృద్ధిరేటు జనవరిలో ప్రతికూలంగా నమోదైంది. అయితే ముడిచమురు, సహజ వాయువు, సిమెంట్ రంగాల్లో ఉత్పత్తి వృద్ధిదాయకంగా ఉన్నది. బొగ్గు, ఉక్కు, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత సైతం నిరాశాజనకంగానే కనిపిస్తున్నది. ఇక ఈ 8 కీలక రంగాల వాటా.. దేశ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో 40.27 శాతంగా ఉంటున్నది.

# మెడ్‌ట్రానిక్ అతిపెద్ద పరిశోధన కేంద్రం



**హైదరాబాద్ :** ఐర్లాండ్‌కు చెందిన మెడికల్ టెక్నాలజీ సేవల సంస్థ మెడ్‌ట్రానిక్..హైదరాబాద్‌లో తాజాగా ఇంజి నీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను నెల కొల్పింది. 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ప్రారంభించారు. అమెరికా బయట సంస్థకు ఇదే అతిపెద్ద రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) సెంటర్ కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ ఛైర్మన్, సీఈవో జియోఫ్ మార్థా మాట్లాడుతూ..వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగానే ఇక్కడ ఆర్ అండ్ డీ సెంటర్‌ను నెలకొల్పినట్లు చెప్పారు.వచ్చే ఐదేండ్లలో రూ.3 వేల కోట్లు( 350 మిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు ఇటీవల ప్రకటి ంచిన సంస్థ..దీంట్లో భాగంగానే ఆర్ అండ్ డీని మరింత విస్తరించింది. అలాగే ఉద్యోగుల సంఖ్యను 1,500కి పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు.

అంతర్జాతీయ ఉత్పత్తుల అభివృద్ధిలో తమ ఆర్‌అండ్‌టీ టీం కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రాంతీయ ఇన్నోవేషన్ ఎకోసిస్టాన్ని ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా సహా య సహ కారాలు అందించినట్లు చెప్పారు. అంతర్జాతీయంగా రోగులకు మెరుగైన సేవలు నేరుగా అందించడానికి వీలు పడనున్నదని, హెల్త్‌కేర్ టెక్నాలజీ రంగంలో మరో ముం దడుగు పడినట్లు అవుతున్నదన్నారు. గ్లోబల్ హెల్త్‌కేర్ దిగ్గజమైన ఎంఈఐసీ..2011లో హైదరాబాద్‌లో అడుగుపెట్టింది.

# వరుసగా మూడు టెస్టుల్లో విఫలం..

## అయినా పాటిదార్‌ను ఆడించాల్సిందే అంటున్న మిస్టర్ 360

ఇంగ్లండ్‌తో వైజాగ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో ఎంట్రీ ఇచ్చి ఆ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో కాస్త చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడిన టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ రజత్ పాటిదార్ ఆ తర్వాత వరుసగా ఐదు ఇన్నింగ్స్‌లలో డబుల్ డిజిట్ చేరడానికి నానా తంటాలు పడుతున్నాడు. దేశవాళీ క్రికెట్‌తో పాటు భారత్ 'ఏ'కు ఆడిన క్రమంలో టన్నుల కొద్దీ పరగులు చేసి సెలక్టర్ల దృష్టిలో పడిన పాటిదార్.. జాతీయ జట్టులో మాత్రం ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోతున్నాడు. వరుస వైఫల్యాలతో మూడు టెస్టులలో 63 పరుగులే చేసిన పాటిదార్‌ను ధర్మశాల టెస్టులో పక్కనబెట్టి దేవ్‌దత్ పడిక్కల్‌కు ఛాన్స్ ఇవ్వనున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్.. పాటిదార్‌కు మద్దతుగా నిలిచాడు. డివిలియర్స్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా స్పందిస్తూ 'రజత్ పాటిదార్ ఈ సిరీస్ (ఇంగ్లండ్)లో లైఫ్ టైమ్ గుర్తుంచుకునే ఇన్నింగ్స్‌లు ఆడలేదు. కానీ ప్రస్తుతం భారత జట్టులో ఉన్న మంచి విషయం ఏంటంటే కొన్నిసార్లు మనం బాగా ఆడకున్నా ఫలితాలు జట్టుకు అనుకూలంగా వస్తున్నప్పుడు టీమ్‌లో కొనసాగొచ్చు. పాటిదార్ అటిట్యూడ్ బాగా ఉండి అతడి క్యారెక్టర్ డ్రెస్సింగ్ రూమ్‌లో అందరికీ నచ్చితే కెప్టెన్ రోహిత్ శర్మ అతడు టీమ్‌లో ఉండాలని సెలక్టర్లను కోరొచ్చు. ఈ కుర్రాడికి మంచి భవిష్యత్ ఉంది. ప్రస్తుతానికి అతడు పరుగులేమీ చేయకున్నా అతడికి మరిన్ని అవకాశాలిచ్చి చూడండి..' అని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం భారత జట్టులో కుర్రాళ్లు అంచనాలకు మించి రాణిస్తున్నారని డివిలియర్స్ కొనియాడాడు. జట్టులోకి వచ్చే ఆటగాళ్లు పాజిటివ్ అటిట్యూడ్‌తో ఉన్నారని, వాళ్లకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని మిస్టర్ 360 అన్నాడు. ఇదిలాఉండగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే 3-



1తో గెలుచుకున్న భారత్.. ఈనెల 7 నుంచి ధర్మశాల వేదికగా ఆఖరి టెస్టు ఆడనుంది. ఈనెల 2 తర్వాత భారత జట్టు ధర్మశాలకు వెళ్లే అవకాశముంది.

# గుజరాత్‌లో అంబానీ ప్రీ- వెడ్డింగ్ వేడుక..

## తరలివెళ్తున్న మాజీ క్రికెటర్లు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్ ముందే క్రికెట్ దిగ్గజాలంతా ఒక్క చోట చేరుతున్నారు. ముంబై ఇండియన్స్‌యజమాని, ప్రముఖ వ్యాపారవేత్త ముఖేశ్ అంబానీ చిన్న కుమారిడి ప్రీ -వెడ్డింగ్ వేడుకకు మాజీ ఆటగాళ్లంతా తరలివెళ్తున్నారు. మాజీ సారథి ఎంఎస్ ధోనీ, సచిన్ టెండూల్కర్ కుటుంబంతో కలిసి అనంత్ అంబానీరాధిక ముందస్తు పెండ్లితంతులో పాల్గొనేందుకు వెళ్లారు.
శుక్రవారం ముంబై విమానాశ్రయంలో మహీ, సచిన్‌లు కుటుంబ సమేతంగా కెమెరా కంట పడ్డారు. మాజీ పేసర్ జహీర్ ఖాన్, ముంబై ఇండియన్స్ కొత్త కెప్టెన్ హార్దిక్ పాండ్యా, పవర్ హిట్టర్ సూర్యకుమార్ యాదవ్, కృనాల్ పాండ్యాలు కుటుంబ సమేతంగా హాజరుకానున్నారు. గుజరాత్‌లోని జామ్ నగర్‌లో అనంత్, రాధికల ప్రీ-వెడ్డింగ్ వేడుకలు మార్చి 1న మొదల వ్వనున్నాయి. జహీర్ ఖాన్, ఇషాన్ కిషన్, పాండ్యా బ్రదర్స్, సూర్యకుమార్‌చిన్నప్పుడు అనంత్ జామనగర్‌లో పెరగడంతో అక్కడే ఈ కార్యక్రమం నిర్వహించాలని అంబానీ కుటుంబం భావించింది. ఈ వేడుకను వీక్షించేందకు బాలీవుడ్ హీరోలతో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు వెళ్లనున్నారు. అనంత్, రాధికాలు జూలై 12వ తేదీన పెండ్లి చేసుకోనున్నారు. విడదీయలేని బంధం అంబానీ కుటుంబానికి క్రికెట్‌తో విడదీయలేని బంధం ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ ముంబై ఇండియన్స్ జట్టు వాళ్లదే. ముఖేశ్ అంబానీ భార్య నీతూ అంబానీ, కొడుకు అనంత్ అంబానీలు క్రికెట్ వ్యవహారాలు చూసుకునేవాళ్లు. ఐపీఎల్ ట్రోఫీతో రోహిత్ శర్మ రోహిత్ శర్మ కెప్టెన్సీలో ముంబై ఏకంగా ఐదు సార్లు చాంపియన్‌గా నిలిచింది. అంతేకాదు మహిళల ప్రీమియర్ లీగ్‌లోనూ ముంబై



జట్టు నిరుడు చాంపియన్‌గా అవతరించింది. ఇంటర్నేషనల్‌లో టీ20 లీగ్‌లో నికోలస్ పూరన్ సారథ్యంలోని ఎంఐ ఎమిరేట్స్ విజేతగా నిలిచింది.

# డాక్యుమెంటరీగా దాయాదుల క్రికెట్ వైరం..

## ఫస్ట్ లుక్ వీడియో వైరల్

ప్రపంచ క్రికెట్‌లో భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజే వేరు. చిరకాల ప్రత్యర్థులైన ఇండియా, పాక్‌లు మైదానంలో తలపడుతున్నాయంటే స్టేడియాలు కిక్కిరిసిపోతాయి. బంతి బంతికి ప్రేక్షకుల్లో నరాలు తెగేంత ఉత్కంఠ కనిపిస్తోంది. అందుకనే క్రికెట్‌లోని గొప్ప సమరాల్లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ఒకటిగా పేరొందింది. అయితే.. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల సరిగ్గా లేని కారణంగా భారత్, పాక్‌లు ఐసీసీ ట్రోఫీ మాత్రమే పోటీపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ ఓ టీటీ ఫ్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఇండో పాక్ జట్ల మధ్య ఉన్న క్రికె ట్ వైరాన్నిడాక్యుమెంటరీగా రూపొందించింది. శుక్రవారం 'గ్రేటెస్ట్ రైవర్లీ'పేరుతో చిత్రీకరించిన డాక్యుమెంటరీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. 'లైట్స్, కెమెరా, క్లీన్ బౌల్డ్. చరిత్రలో భాగమైన, గ్రేటెస్ట్ రైవర్లీ నెట్‌ఫ్లిక్స్‌లో త్వరలోనే రాబోతోంది' అనే క్యాప్షన్‌తో ఉన్న ఆ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది. నిరుడు ఆసియా కప్, వన్డే వరల్డ్ కప్‌లో భారత్, పాకిస్థాన్‌లు తలపడ్డాయి. అయితే.. ఈ రెండు టోర్నీలోనూ దాయది జట్టును టీమిండియా చిత్తుగా ఓడించింది. మళ్లీ టీ20 ప్రప ంచకప్‌లో భారత్, పాక్‌లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతి థ్యమిస్తున్న ఈ మోగా టోర్నీ జూన్ 1వ తేదీన షురూ కానుంది. జూన్ 9వ తేదీన న్యూయార్క్ వేదికగా ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ జరుగనుంది. టీమిండియదే పైచేయిఐసీసీ ట్రోఫీల్లో భారత్, పాకిస్థాన్ తలపడడం ఇది ఎనిమిదో సారి. గత ఏడు పర్యాయాలు దాయాదిపై టీమిండియా పైచేయి సాధించింది. ఇప్పటివరకూ భారత జట్టు ఆరుసార్లు విజేతగా నిలిచింది. 2007 టీ20 ప్రపంచ కప్ ఫైనల్లో ధోనీ సేన పాక్‌ను చిత్తు చేసింది. 2022 పొట్టి ప్రపంచకప్‌లో మెల్‌బోర్న్‌లో జరిగిన




మ్యాచ్‌లో వీరోచిత ఇన్నింగ్స్‌తో ఆడిన విరాట్ కోహ్లీ ఒంటి చేత్తో పాక్‌ను ఓడించాడు.

# బంగ్లాదేశ్ జట్టుకు కొత్త జెర్సీ..

## టైటిల్ స్పాన్సర్ ఎవరంటే..?

సొంతగడ్డపై శ్రీలంకతో జరుగబోయే టీ 20 సిరీస్‌లో బంగ్లాదేశ్ క్రికెటర్లు కొత్త జెర్సీతో బరిలోకి దిగనున్నారు. సీనియర్ జట్టుతో పాటు జనియర్ జట్టు ఆటగాళ్లు కూడా కొత్త జెర్సీలో తళుక్కుమననున్నారు. అవును.. శుక్రవారం ఆ దేశ క్రికెట్ బోర్డు ఢాకాలో కొత్త జెర్సీలను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో పురుషుల జట్టు సారథి నజ్ముల్ హుసేన్ శాంటో ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్‌లు పాల్గొన్నారు. కొత్త జెర్సీలు ధరించి స్టేజ్‌మీద సందడి చేశారు. మహిళల జట్టు వైస్ కెప్టెన్ నహిదా అక్తర్, పేసర్ మరుఫా అక్తర్, అండర్ -19 కెప్టెన్లు మహ్‌ఫుజుర్



రహ్మన్ రబ్బీ, రబెయా ఖాన్‌లు కూడా కొత్త జెర్సీలు ధరించి ఫొటోలకు పోజిచ్చారు. కన్నుల పండువగా సాగిన ఈ ఈవెంట్‌లో టైటిల్ స్పాన్సర్ పేరును కూడా బంగ్లా క్రికెట్ బోర్డు వెల్లడించింది. పాపులర్ మొబైల్ నెట్‌వర్క్ కంపెనీ రొబి టైటిల్ స్పాన్సర్‌గా వ్యహరించనుందని బీసీబీ పెద్దలు తెలిపారు.
'రోబి మళ్లీ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నందకు చాలా సంతోషంగా ఉంది. త్వరలోనే స్వదేశంలో శ్రీలంకతో సిరీస్ ఆడబో తున్నాం. రోబి సహకారంతో జాతీయ జట్టు మరిన్ని అద్భుతాలు చేయనుంది' అని బీసీబీ డైరెక్టర్ అక్రమ్ ఖాన్ తెలిపాడు.

# కమిన్స్ వికెట్ల 'సెంచరీ'..

## అరుదైన క్లబ్‌లో ఆసీస్ సారథి



ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అరుదైన ఫీట్ సాధించాడు. కంగారూ జట్టు సారథిగా 100 వికెట్లు పడగొట్టాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో డారిల్ మిచెల్ ఔట్ చేసిన కమిన్స్ 100 వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. దాంతో, ఈ ఘనతకు చేరువైన పదో కెప్టెన్‌గా కమిన్స్ రికార్డు సృష్టించాడు. అతడి కంటే ముందు భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ షాన్ పొలాక్, పాకిస్థాన్ మాజీ పేసర్ వసీమ్ అక్రమ్, వెస్టిండీస్ ఆల్‌రౌండర్ జేసన్ హెూల్డర్‌లు ఈ ఫీట్ సాధించారు. కప్టెన్‌గా వందకు పైగా వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో పాక్ మాజీ సారథి ఇమ్రాన్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇమ్రాన్ 71 ఇన్నింగ్స్‌ల్లో 187 వికెట్లు తీశాడు. కపిల్ దేవ్ 58 ఇన్నింగ్స్‌ల్లో 111 వికెట్లు తీయగా.. షాన్ పొలాక్ 50 ఇన్నింగ్స్‌ల్లో 103 వికెట్లు పడగొట్టాడు. 47వ కెప్టెన్‌గాకరీబియన్ ఆల్‌రౌండర్ హెూల్డర్ 63 ఇన్నింగ్స్‌ల్లో 100 వికెట్లతో 9వ స్థానంలో నిలిచాడు. న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ముగిసే లోపే కమిన్స్.. హెూల్డర్, పొలాక్ రికార్డులను బద్ధలు కొట్టే చాన్స్ ఉంది. పేస్ బౌలర్ అయిన కమిన్స్ 2021లో ఆస్ట్రేలియా టెస్టు సారథిగా ఎంపికయ్యాడు. టిమ్ పైన్‌తర్వాత 47వ టెస్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. కమిన్స్ నాయకత్వంలో ఆసీస్ సంచలన విజయాలు సాధించింది. 2023లో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఓవల్ వేదికగా జరిగిన ఫైనల్లో భారత జట్టును ఓడించిన కమిన్స్ సేన టెస్టు గద సొంతం చేసుకుంది. అనంతరం వన్డే వరల్డ్ కప్‌లోనూ టీమిండియను చిత్తు చేసి ఆరోసారి విశ్వ విజేతగా అవతరించింది.

# సర్ఫరాజ్ టీ20ల కంటే టెస్టులకే

## పనికొస్తాడు.. ఎందుకంటే..?

ఇంగ్లండ్ సిరీస్‌లో భారత జట్టుకు కుర్రాళ్లే కొండంత అండగా నిలిచారు. అరంగేట్రంలోనే సంచలన ప్రదర్శనతో రోహిత్ సేన సిరీస్ గెలవడంలో కీలక పాత్ర పోషించారు. ఈ టెస్టు సిరీస్‌తో టీమిండియాకు సర్ఫరాజ్ ఖాన్ రూపంలో విలువైన ఆటగాడు దొరికాడు. రాజ్‌కోట్ టెస్టు అరంగేట్రం చేసిన ఈ ముంబై క్రికెటర్ అద్భుతంగా రాణించాడు. దాంతో ధర్మశాల టెస్టుకు ముందు సర్ఫరాజ్‌పై మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అతడు టీ20 లకంటే సుదీర్ఘ ఫార్మాట్‌కే బాగా సరిపోతాడని దాదా అన్నాడు.
'సర్ఫరాజ్ నిఖార్సైన టెస్టు ఆటగాడు. అతడి ఆట టీ20ల కంటే టెస్టులకు బాగా సరిపోతుంది. దేశవాళీ క్రికెట్‌లో అతడు ఎన్నో రన్స్ సాధించాడు. రంజీ ట్రోఫీ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ముంబై తరఫున సర్ఫరాజ్ పరుగుల వరద పారించాడు. ఓ ఆటగాడు పరుగులు సాధిస్తే అది ఎప్పటికీ వృథా కాదు. సర్ఫరాజ్ ఖాన్ విషయంలోనూ అదే జరిగింది' అని గంగూలీ వెల్లడించాడు.



ఫస్ట్ క్లాస్‌లో 47 మ్యాచులు ఆడిన సర్ఫరాజ్ 68.74 సగటుతో 4,056 పరుగులు సాధించాడు. అతడి పేరిట 14 సెంచరీలు, 13 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. సర్ఫరాజ్(62, 68)రాజ్‌కోట్‌లో హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ చేతుల మీదుగా డెబ్యూ క్యాప్ అందుకున్న సర్ఫరాజ్.. తొలి ఇన్నింగ్స్‌లో 62, రెండో ఇన్నింగ్స్‌లో 68 పరుగులతో ఆకట్టుకున్నాడు. అంతే కాదు 48 బంతుల్లోనే 50 రన్స్ కొట్టిన సర్ఫరాజ్ టీమిండియా తరఫున రెండో వేగవంతమైన ఫిఫ్టీ నమోదు చేశాడు. దూకుడుగా ఆడడంతో పాటు స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్న సర్ఫరాజ్ రాజ్‌కోట్‌లో ఇంగ్లండ్ బౌలర్లపై పైచేయి సాధించాడు. అయితే.. రాంచీ టెస్టులో విఫలమైనప్పటికీ ఆఖరి టెస్టులో సత్తా చాటేందుకు ఈ రైట్‌హ్యాండ్ బ్యాటర్ సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే భారత జట్టు 3-1తో సిరీస్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. నామమాత్రమైన ఐదో టెస్టు మార్చి 7వ తేదీన ధర్మశాలలో షురూ కానుంది.

# మార్చి 17 నుంచి మియామీ ఓపెన్ ..

## వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇస్తోంది వీళ్లే..!



గ్రాండ్‌స్లామ్ టోర్నీల తర్వాత బాగా పాపులర్ అయిన మియామీ ఓపెన్ మరో 16 రోజుల్లో మొదలవ్వనుంది. ఏటీపీ మాస్టర్స్ 1000 ఈవెంట్స్‌లో ఒకటైన ఈ మెగా టోర్నీలో స్టార్ ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు. బ్రిటన్ టెన్నిస్ స్టార్ ఎమ్మా రాడుకానూ అమెరికా నల్ల కలువ వీనస్ విలియమ్స్ వైల్డ్‌కార్డ్ ఎంట్రీ దక్కించుకున్నారు. అనారోగ్యం కారణంగా 8 నెలలు బ్రేక్ తీసుకున్న రాడుకానూ ప్రస్తుతం 252 ర్యాంక్‌లో ఉంది. దాంతో, తక్కువ ర్యాంక్ వల్ల ఆమె ప్రీమియర్ డబ్ల్యూటీఏ టోర్నమెంట్‌కు అర్హత సాధించలేకపోయింది. అందుకనే వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో మియామీ ఓపెన్‌లో ఆడనుంది. మియామీ ఓపెన్‌లో వీనస్‌కు గొప్ప రికార్డు ఉంది. మూడుసార్లు (ఆమె 1998, 1999, 2001లో ) చాంపియన్‌గా నిలిచింది. ప్రస్తుతం 43 ఏండ్ల వయసున్న ఆమె యువ క్రీడాకారుణులతో పోటీ పడనుంది. ఈ ఇద్దరితో పాటు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత కరొలినే వోజ్నియాకి, జపాన్‌కు చెందిన కే నిషికోరిలు సైతం వైల్డ్‌కార్ట్ ద్వారా బరిలోకి దిగనున్నారు. మార్చి 17వ తేదీ నుంచి ఈ టోర్నీ షురూ కానుంది.

# అమ్మాయిలూ ఆడాల్సిందే..

## రెడ్ బాల్ టోర్నమెంట్ ఆ రోజు నుంచే..!




సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడే క్రికెటర్లకు సెంట్రల్ కాంట్రాక్ట్‌లు కట్టబెట్టిన బీసీసీఐ మరో నిర్ణయం తీసుకుంది. అబ్బాయిలతో పాటు అమ్మాయిలు కూడా దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందేనని స్పష్టం చేసింది. సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు సైతం రంజీల్లో ఆడాలని తేల్చి చెప్పిన బీసీసీఐ మహిళా క్రికెటర్లు మరింత రాటుదేలేందుకు 'రెడ్ బాల్ క్రికెట్ టోర్న' ప్లాన్ చేస్తోంది. డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ ముగిశాక ఈ టెస్టు టోర్నమెంట్ నిర్వహించనుంది. మొత్తం ఆరు జోన్ల జట్లు తలపడే ఈ టోర్నీ మార్చి 29న షురూ కానుంది. ఈస్ట్, వెస్ట్, నార్త్, సెంట్రల్, సౌత్, నార్త్ ఈస్ట్ జోన్లు ఈ టోర్నీలో అమీతుమీ తేల్చుకోనున్నాయి. రెండు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లను మార్చి 29, 30, 31వ తేదీల్లో ఆడిస్తారు. సెమీ ఫైనల్ మ్యాచ్‌లు ఏప్రిల్ 5, 6, 7వ తేదీల్లో.. ఫైనల్ మ్యాచ్‌ను ఏప్రిల్ 9, 10, 11వ తేదీల్లో నిర్వహించనున్నారు. టెస్ట్ సిరీస్ ట్రోఫీతో భారత జట్టుఈ ఏడాది ఆరంభంలో భారత మహిళల జట్టు రెండు టెస్టు సిరీస్‌లు ఆడింది. స్వదేశంలో ఇంగ్లండ్, సృష్టించింది.

# రాడిసన్ డ్రగ్స్ కేసులో ట్విస్ట్ ..

## ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో క్రిష్ పిటిషన్

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన రాడిసన్ డ్రగ్స్ కేసు ఊహించని మలుపులు తిరుగుతోంది. ఈ డ్రగ్స్ పార్టీలో టాలీవుడ్ సినీ డైరెక్టర్ జాగర్లమూడి క్రిష్ కూడా ఉన్నట్టు పోలీసులు పేర్కొన్న విషయం తెలిసిందే.

ఇక క్రిష్ ను విచారించేందుకు పోలీసులు సిద్ధం అయ్యారు. క్రిష్ వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాల్సిందేనని పోలీసులు తెలిపారు. అయితే గచ్చిబౌలి పోలీసుల విచారణకు హాజరుకాకుండా హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు క్రిష్.ఇక ఈ పిటిషన్‌లో "వివేకానంద ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో నన్ను నిందితుడిగా చేర్చారని క్రిష్ పేర్కొన్నాడు. నాకు డ్రగ్స్ పార్టీతో సంబంధమే లేదు. నేను డ్రగ్స్ తీసుకున్నాననడానికి ఆధారాలు లేవు. కావాలనే నన్ను ఈ కేసులో ఇరికించారు. ప్రస్తుతం తాను ముంబైలో ఉన్న కారణంగా పోలీసుల విచారణకు రాలేనని, మరో రెండు రోజుల సమయం కావాలని కోరారు". దీంతో ఈ ముందస్తు బెయిల్‌పై విచారణ జరిపిన హైకోర్టు రాడిసన్ డ్రగ్స్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించాలని గచ్చిబౌలి పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది





# 'ఫ్యామిలీ స్టార్' టీజర్‌పై అప్‌డేట్ ఇచ్చిన విజయ్ దేవరకొండ

రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్' గీతగోవిందం సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన పరశురాం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాళ్ ఠాకూర్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తుండగా.. ఎస్‌వీసీ బ్యానర్‌లో వస్తున్న 54వ చిత్రమిది. ఈ సినిమా ఏప్రిల్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్రయూనిట్ ప్రమోషన్స్ షూరు చేసింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్‌తో పాటు ఫస్ట్ సింగిల్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది.ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ అప్‌డేట్ ఇచ్చాడు విజయ్ దేవరకొండ. త్వరలోనే టీజర్ రానుంది అంటూ ఎక్స్‌లో రాసుకోచ్చాడు. ఇక ఈ సినిమాలో కుటుంబ బాగోగులు చూసుకునే ఫ్యామిలీ మ్యాన్‌గా, బయట రౌడీల బెండు తీసే పవర్‌ఫుల్ మ్యాన్‌గా విజయ్ దేవకొండ ఇందులో కనిపించనున్నారు. కూల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరించనున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్, సంగీతం: గోపీ సుందర్.విజయ్ దేవరకొండ మరోవైపు జెర్సీ ఫేం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో 12లో కూడా నటించనున్నాడు పోలీస్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్–శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోండగా..



అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.

## మహా శివరాత్రి కానుకగా ఓటీటీలోకి 'హనుమాన్'.. స్ట్రీమింగ్ ఎందులో




టాలీవుడ్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ హనుమాన్ తేజ సజ్జా కథా నాయకుడిగా నటించిన ఈ సినిమా జనవరి 12న ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పటివరకు ఈ చిత్రం రూ. 300 కోట్లకు పైగా వసూళ్ళను రాబట్టింది. ఇదిలావుంటే ఈ మూవీ ఎప్పుడు ఓటీటీలోకి వస్తుందా ఎప్పు డెప్పుడు చూద్దామా అంటూ ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమం లోనే వారికి గుడ్ న్యూస్ చెప్పారు మేకర్స్.హనుమాన్ మూవీ తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ జీ5 వేదికగా ఈ చిత్రం మహా శివరాత్రి కానుకగా మార్చి 08 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ ఎక్స్‌లో ప్రకటించింది.ఈ సినిమా కథ విష యానికి వస్తే.. అది అంజనాద్రి అనే ఊహ ప్రాంతం. ఆ వూర్లో హను మంతు (తేజాసజ్జా) ఒక మామూలు కుర్రాడు. చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ సరదాగా కాలం గడిపే స్తుంటాడు. అనుకోని సంఘటనతో హనుమంతుకి కొన్ని అతీత శక్తులు వ స్తాయి. ఆ శక్తుల గురించి తెలు సుకున్న మైఖెల్ (వినయ్‌రాయ్) అం జనాద్రి వస్తాడు. హనుమంతు వద్ద శక్తులని తన వశం చేసుకొని ప్రపం చంలోనే అత్యంత శక్తివంతుడు కావా లనుకుంటాడు.

# అనంత్ అంబానీ ప్రీ వెడ్డింగ్ ఈవెంట్‌లో రిహాన్నా షో..

## ఆ పాప్ సింగర్ రెమ్యూనరేషన్ ఎంతో తెలుసా?

**న్యూఢిల్లీ:** వ్యాపారవేత్త ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ .. రాధికా మర్చెంట్‌ను పెళ్లాడనున్న విషయం తెలిసిందే. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో పెళ్లి వేడుక జరగనున్నది. అయితే ఇవాళ జరగనున్న ప్రీ వెడ్డింగ్ ఈవెంట్‌లో పాప్ సింగర్ రిహాన్నా పర్ఫార్మ్ చేయనున్నది. తన పర్ఫార్మెన్స్ కోసం రిహాన్నా.. సుమారు 9 మిలియన్ల డాలర్లు ఛార్జ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంటే ఆ సింగర్ దాదాపు 75 కోట్లు వసూల్ చేస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. యాన్ ఈవినింగ్ ఇన్ ఎవర్‌ల్యాండ్



టైటిల్‌తో ఈవెంట్‌ను ఆర్గనైజ్ చేస్తున్నారు.పాప్ సింగర్ రిహాన్నా.. ఫిబ్రవరి 29వ తేదీన జామ్‌నగర్‌కి వచ్చేసింది. తమ ట్రూప్‌తో ఆమె ఈవెంట్ ప్రదేశంలో దిగింది. తన ఆల్బమ్‌లోని హిట్ సాంగ్స్‌ను రిహాన్నా పాడే అవకాశాలు ఉన్నట్లు అను మానిస్తున్నారు. దీని కోసం ఆమె భారీ సెట్ వేస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. స్టేజ్ ఎక్విప్మెంట్, డ్రెస్సులు, బ్యాక్‌గ్రౌండ్ సింగర్లకే ఎక్కువ ఖర్చు అవుతోంది.రిహాన్నా తన చివరి పర్ఫార్మెన్స్‌ను 2023 సూపర్ బౌల్ ఈవెంట్‌లో చేసింది.

# ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసిన 'షీనా బోరా' హత్య కేసు డాక్యుమెంటరీ




2015లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన షీనా బోరా హత్య కేసుపై ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ రూపొందించిన డాక్యుమెంటరీ 'ది ఇంద్రాణీ ముఖర్జియా స్టోరీ: బరీడ్ ట్రూత్'. ఈ డాక్యుమెంటరీని ఫిబ్రవరి 23 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే డాక్యుమెంటరీ ప్రసారం కాకుండా నిలిపివేయాలని స్పెషల్ కోర్టులో సీబీఐ పిటిషన్ వేసింది. ఈ డాక్యుమెంటరీలో షీనా బోరా కేసులో నిందితులుగా ఉన్న వాళ్లు, నిందితులతో సంబంధం ఉన్న వాళ్లు నటించారని, కాబట్టి ఆ డాక్యుమెంటరీ ప్రసారం కాకుండా అడ్డుకోవాలని పిటిషన్‌లో పేర్కొంది.అయితే ఈ డాక్యుమెంటరీ సిరీస్‌ను నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కాకుండా నిలిపివేయాలని అభ్యర్థిస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను ముంబైలోని సీబీఐ ప్రత్యేక కోర్టు తోసిపుచ్చింది. డాక్యుమెంటరీ ప్రసారాలను నిలి పివేయాలని ఆదేశించే అధికారం తమకు లేదని కోర్టు స్పష్టం చేసింది. అలాగే దర్యాప్తు సంస్థతోపాటు న్యాయస్థానం వీక్షించేందుకు ముందస్తుగా ప్రదర్శించాలని సదరు ఓటీటీ సంస్థను కోర్టు ఆదేశించింది. ఇక ఈ డాక్యుమెంటరీపై దాఖలైన పిటిషన్‌ను కోర్టు కొట్టి వేసింది. దీంతో తాజాగా నెట్‌ఫ్లిక్స్ ఈ డాక్యుమెంటరీని స్ట్రీమింగ్‌లోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారమవుతోంది.2015లో షీనాబోరా హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విష యం తెలిసిందే. కన్నతల్లే కూతుర్ని చంపేసిన వైనం అందర్నీ విస్మయానికి గురి చేసింది. ఏప్రిల్, 2012 సంవత్సరంలో ఇంద్రాణి ముఖర్జియా తన డ్రైవర్ శ్యామ్‌వర్, మాజీ భర్త సంజీవ్ ఖన్నాతో కలిసి.. తన మరో మాజీ భర్తతో కన్న 25 ఏళ్ల కూతురు షీనా బోరాను గొంతు నులిమి చంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. వేరే కేసులో అరెస్టయిన డ్రైవర్ శ్యామ్‌వర్ ద్వారా 2015లో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. దాంతో 2015లో ప్రధాని నిందితురాలు ఇంద్రాణి ముఖర్జియాతోపాటు డ్రైవర్ శ్యామ్‌వర్, మాజీ భర్త సంజీవ్ ఖన్నా, ప్రస్తుత భర్త పీటర్ ముఖర్జియాను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అప్పటి నుంచి ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తున్నది. ఈ కేసులో ప్రధాన నిందితురాలు ఇంద్రాణి ముఖర్జియాకు 2022లో బెయిల్ లభించింది. కేసులో ఇతర నిందితులు కూడా ప్రస్తుతం బెయిల్‌పై బయటే ఉన్నారు.

# 28 ఏళ్లకే.. క్యాన్సర్‌తో మాజీ మిస్ ఇండియా కన్నుమూత



మాజీ మిస్ ఇండియా త్రిపుర రింకీ చక్మా కన్నుమూశారు. గత రెండేళ్లుగా క్యాన్సర్ పోరాడుతున్న ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం రింకీ వయసు 28 ఏళ్లు.త్రిపురకు చెందిన రింకీ చక్మా.. 2017లో మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని ఫైనలిస్ట్‌గా నిలిచారు. రెండేళ్ల క్రితం ఆమె బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడ్డారు. అందుకోసం ట్రీట్‌మెంట్ కూడా తీసుకున్నారు. మొదట తగ్గినప్పటికీ.. ఆతర్వాత మళ్లీ పెరగడం ప్రారంభించింది. వ్యాధి క్రమంగా ఊపిరితిత్తులు, తలకు వ్యాపించింది. చికిత్స అందించినా ప్రయోజనం లేకపోయింది. ఈ క్రమంలో పది రోజుల క్రితం అంటే ఫిబ్రవరి 22న తీవ్ర అస్వస్థతకు గురైన రింకీని కుటుంబ సభ్యులు హుటాహుటిని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.2022 నుంచి బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న రింకీ చక్మా.. ఎప్పుడూ దాని గురించి బహిరంగంగా వెల్లడించలేదు. అయితే, చికిత్సకు డబ్బుల కోసం ఆ విషయాన్ని బయటికి చెప్పాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కొన్నివారాల క్రితం సోషల్ మీడియా వేదికగా తనకు బ్రెస్ట్ క్యాన్సర్ ఉందని వెల్లడించింది. ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటూ సుదీర్ఘ పోస్టు పెట్టింది. తాను రెండేళ్ల నుంచి ఈ వ్యాధితో పోరాడుతున్నట్లు చెప్పింది. దీంతో ఆమె స్నేహితులు తోటి మిస్ ఇండియా పోటీ సహచరులు నిధులు కూడా సేకరించారు. అయినప్పటికీ ఆమె ప్రాణాలను నిలపలేకపోయారు. ఆరోగ్యం క్షీణించి రింకీ ప్రాణాలు కోల్పోయింది.రింకీ చక్మా క్యాన్సర్‌తో మరణించిన విషయాన్ని మిస్ ఇండియా ఆర్గనైజేషన్ ధ్రువీకరించింది. 2017 లో మిస్ ఇండియా అందాల పోటీల్లో పాల్గొన్న రింకీ చక్మా.. మిస్ బ్యూటీ విత్ పర్పస్ టైటిల్ గెలుచుకున్నారు. ఆ ఏడాది హర్యానాకు చెందిన మానుషి చిల్లర్ మిస్ ఇండియా కిరీటం దక్కించుకున్నారు.

**Owner, Editor, Printed & Published :** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews@gmail.com, e-mail : gbuchireddy79@gmail.com